www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

విజయ దశమి శుభాకాంక్షలు

శనివారం | 12-10-2024 | పేజీలు: 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 178 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం; తిథి: నవమి ఉ. 10.59 తదుపరి దశమి; నక్షత్రం: శ్రవణం తె. 4.25 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ. 9.15 -10.47; దుర్ముహూర్తం: ఉ. 6.11-7.44; అమృతఘడియలు: రా. 6.28-8.00; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 5.51 | విశాఖపట్నం జిల్లా

Visakhapatnam | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రైళ్లు కిటకిట




విశాఖపట్నం, అక్టోబరు 11: దసరా ప్రయాణికులతో రైళ్లు కిక్కిరిశాయి. విశాఖ రైల్వే స్టేషన్ శుక్రవారం కిటకిటలాడింది. దసరాకు సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికులకు విజయవాడ దుర్గమ్మ దర్శనానికి వెళ్లే భవానీ భక్తులు తోడవడంతో సికింద్రాబాద్, తిరుపతి, విజయవాడ వైపు వెళ్లే రైళ్లన్నీ రద్దీగా మారాయి. కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్లే భక్తులు రత్నాచల్, తిరుమల ఆశ్రయించారు. దీంతో జనరల్ కోచ్‌లు కిక్కిరిసిపోగా, స్లీపర్ క్లాసు రిజర్వేషన్ కోచ్‌లు జనరల్ కోచ్‌లను తలపించాయి. విజయనగరం, శ్రీకాకుళం, పలాస ప్రాంతాలకు వెళ్లేవారితో భువనేశ్వర్ ఇంటర్‌సిటీ, రాయపూర్, బ్రహ్మపూర్, రాయగడ, కోరాపుట్ రైళ్లకు డిమాండ్ ఏర్పడింది. దూర ప్రాంతాల నుంచి విశాఖ మీదుగా హౌరా వైపు వెళ్లే రైళ్లలో జనరల్ కోచ్‌లో ప్రయాణించే వారి పరిస్థితి దయనీయంగా మారింది. జనరల్, స్లీపర్ క్లాసు కోచ్‌లలో బాత్‌రూమ్‌ల వద్ద నిలబడి ప్రయాణించారు.

విపత్తుపై విజయం

పెను తుఫాన్‌ను ఎదుర్కొని నిలబడ్డ నగరం

హుద్‌హుద్ విలయానికి నేటితో పదేళ్లు

- శరవేగంగా అభివృద్ధి బాట పట్టిన విశాఖ



ప్రస్తుతం హనుమంతవాక జంక్షన్

హుద్‌హుద్ తరువాతి రోజున ఇలా...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

హుద్ హుద్. ఈ పేరు వింటే విశాఖ ప్రజల ఒళ్లు ఒక్కసారిగా జలదరిస్తుంది. ఓ విషాద వీచిక కళ్ల ముందు కదలాడుతుంది. పదేళ్ల క్రితం ఇదే రోజున (2014 అక్టోబరు 12) విశాఖపట్నం 'హుద్ హుద్' తుఫాన్ ధాటికి చిగురుటాకులా వణికిపోయింది. గంటకు 206 కి.మీ. వేగంతో వీచిన గాలులకు ఛిన్నాభిన్నమైపోయింది. రూపురేఖలు కోల్పోయింది. చెట్లు కూకటి వేళ్లతో సహా విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సమాచార వ్యవస్థ స్తంభించిపోయింది. చిమ్మచీకట్లు. నగరం ఎలా కోలుకుంటుందో, ఎప్పటికి తేరుకుం టుందోనని అంతా భయపడ్డారు. కానీ కిందికి కొట్టిన బంతి ఎలా పైకి లేస్తుందో అదేవిధంగా విశాఖపట్నం శరవేగంతో అభివృద్ధి సాధించింది. ఇప్పుడు విశాఖ నగరాన్ని చూసినవారు ఎవరైనా హుద్ హుద్ తుఫాన్‌కు దెబ్బతిన్నది ఈ నగరమేనా?...అని ఆశ్చర్యపోతారు. అంతలా మారిపోయింది. స్మార్ట్ సిటీగా రూపాంతరం చెందింది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధానిగా పేరు తెచ్చుకుంది.

విశాఖపట్నానికి తుఫాన్లు కొత్త ఏమీ కాదు. బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడి వాయుగుండంగా ఆపై తుఫాన్లుగా మారి ఎన్నోసార్లు ఇక్కడ తీరం దాటుతుంటాయి. ఆ వర్షాలకు పంటలు కోల్పోయి, ఇళ్లు కూలిపోయి బాధపడిన సందర్భాలు అనేకం. కానీ 2014 అక్టోబరు 12న వచ్చిన హుద్ హుద్ తుఫాన్ సాధారణమైనది కాదు. భారతదేశంలో 1891 తరువాత వచ్చిన 505 తుఫాన్లలో ఒక నగరాన్ని ఢీకొట్టిన తొలి పెను తుఫాన్. గంటకు 206

... మిగతా 4వ పేజీలో



తుఫాన్ సమయంలో నగర వాసుల సమస్యలు ఆలకిస్తున్న నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు (ఫైల్ ఫొటో)

మద్యం దుకాణాలకు పోటెత్తిన దరఖాస్తులు

- జిల్లాలో 155 దుకాణాలకు **3,947** దాఖలు
- అర్ధరాత్రికి మరిన్ని పెరిగే అవకాశం
- రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు రూ.80 కోట్ల ఆదాయం
- 14న దుకాణాలకు లాటరీ వేయనున్న అధికారులు
- వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాట్లు పూర్తి



విశాఖపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు పోటెత్తాయి. మొత్తం 155 మద్యం షాపులకు శుక్రవారం రాత్రి తొమ్మిదిన్నర గంటల వరకు 3,947 దరఖాస్తులు అందాయి. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో ఇంకా కొంతమంది డీడీలను అప్రూవ్ చేసుకునేందుకు ఎక్సైజ్ సర్కిల్ పోలీస్‌స్టేషన్ల వద్ద వేచివుండడంతో దరఖాస్తుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఒక్కో దుకాణానికి సగటున 25.5 దరఖాస్తులు అందాయి. అత్యధికంగా పెందుర్తిలోని షాప్‌నంబరు 82కు 41 దరఖాస్తులు దాఖలవగా, అత్యల్పంగా గాజువాకలోని షాప్ నంబరు 44కు 21 దరఖాస్తులు మాత్రమే పడ్డాయి. నగరంలోని 155 దుకాణాలకు ఢిల్లీకి చెందిన వ్యాపారులు 450 దరఖాస్తులు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. వారితో పాటు 21 మంది ఎన్ఆర్ఐలు కూడా దరఖాస్తు చేసినట్టు సమాచారం. జిల్లాలో మద్యం దుకాణాలకు ఆశించినదానికంటే అధికంగా దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. కేవలం దరఖాస్తు ఫీజురూపంలోనే జిల్లా నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రూ.80 కోట్ల వరకూ ఆదాయం సమకూరిందని చెబుతున్నారు.

లాటరీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

మద్యం దుకాణాల కేటాయింపునకు సిరిపురం జంక్షన్‌లో ని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించనున్న లాటరీ కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సమక్షంలో సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు మొదటి దుకాణానికి లాటరీ వేయడంతో ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎక్సైజ్ సూపరిటెండెంట్ ఆర్‌ప్రసాద్ తెలిపారు. గెజిట్ సీరియల్ నంబరు ఒకటి నుంచి 15 వరకూ దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నవారంతా ఉదయం ఆరు గంటలకే గురజాడ కళాక్షేత్రం వద్దకు చేరుకోవాలన్నారు. అక్కడ

... మిగతా 4వ పేజీలో

మహాలక్ష్మిగా కనకమహాలక్ష్మి



జగదాంబ కూడలి, అక్టోబరు 11: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు శుక్రవారం శ్రీమహాలక్ష్మి రూపంలో కనకమహాలక్ష్మి దర్శనమిచ్చారు. శాకాంబరిగా ప్రత్యేక అలంకరణ జరిపి పూజలు నిర్వహించారు. కనకమహాలక్ష్మికి దేవస్థానం ఈవో కె.శోభారాణి, అధికారులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. విజయదశమి పర్వదినం రోజైన శనివారం కనకమహాలక్ష్మికి స్వర్ణ కవచాలంకరణ, స్వర్ణ పుష్పాలతో పూజలు చేస్తారు.

మాయ లేడీ

హనీట్రాప్‌లో మరింత మంది బాధితులు

- పోలీసులకు అందుతున్న ఫిర్యాదులు
- తమ పేర్లు బయటపెట్టవద్దని వినతులు
- కస్టడీలో నోరు విప్పని నిందితురాలు
- తనకు పెద్ద పెద్ద అధికారులు తెలుసునంటూ బెదిరింపు
- మరోసారి కస్టడీకి తీసుకోవాలని పోలీసుల యోచన
- ఆమె వెనుక ఉన్న ముఠా కోసం గాలింపు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

హనీ ట్రాప్ వ్యవహారంలో బాధితుల జాబితా ఎక్కువగానే కనిపిస్తోంది. మాయలాడి జామ్ జమామీ పెళ్లికాని యువకులతో పాటు వివాహితులను సైతం తన వలలో వేసుకుందని పోలీసుల విచారణలో బయటపడింది. ఎన్ఆర్ఐ ఫిర్యాదుతో అరెస్టయి జైలుకు వెళ్లిన జమామీని భీమిలి పోలీసులు ఒకరోజు కస్టడీకి తీసుకున్న సంగతి తెలిసిందే. గురువారం ఆమెను విచారించారు. అయితే ఆమె ఎటువంటి సమాచారం చెప్పకపోగా తానే బాధితురాలినని, తననే అంతా మోసం చేశారని చెప్పింది. ఎంత ప్రశ్నించినా ఆమె అవే మాటలు తప్ప కొత్త సమాచారం చెప్పకపోవడంతో దసరా పండుగ ముగిసిన తరువాత మరోసారి ఆమెను కస్టడీకి తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు.

ఇక్కడ అమ్మాయే...

ఈ మాయలేడి పేరు జాయ్ జమామి (26). ఆ పేరు చూసి వేరే రాష్ట్రం నుంచో విశాఖపట్నం వచ్చిందని అంతా అనుకుంటారు. కానీ ఆమె ఇక్కడ మురళీనగర్‌లోనే ఉంటోంది. తెలుగు అమ్మాయే. తల్లిదండ్రులు లేరు. రీల్స్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, ఛాటింగ్స్ ద్వారా కుర్రాళ్లను ఆకర్షించేది. ఈ క్రమంలో కొందరు ఆమెతో జత కలిశారు. ధనవంతులను టార్గెట్ చేసి మోసం చేస్తే బాగా డబ్బులు వస్తాయని ప్లాన్ చేసుకొని దానిని అమలు చేసింది. ఆ క్రమంలో ఎన్ఆర్ఐకి ఈ ఏడాది ఆగస్టులో జమామీ ఇన్‌స్టాలో పరిచయం అయింది. సెప్టెంబరులో ఆయన్ను విశాఖపట్నం రప్పించి, విమానాశ్రయం నుంచే తన ఇంటికి తీసుకువెళ్లి మత్తు మందు ఇచ్చింది. నిద్ర పోతున్నప్పుడు తన పక్కన పడుకొని ఫొటోలు తీసుకుంది. వాటిని చూపించి

... మిగతా 4వ పేజీలో

బార్‌ల పంట పండింది!

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సరకు ఖాళీ

- ఈనెల 15న షాపుల రద్దుతో నిలిచిన సరఫరా
- అందుబాటులో ఒకటి, రెండు రకాల బ్రాండ్‌లే
- బార్‌లకు పోటెత్తుతున్న మందుబాబులు
- ఇదే అదనుగా అడ్డగోలు దోపిడీ
- క్వార్టర్‌కు రూ.70, ఫుల్‌కు రూ.250 అధికంగా వసూలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

కొత్తమద్యం పాలసీ పుణ్యమా అని నగరంలో బార్‌ల నిర్వాహకులకు కాసుల వర్షం కురుస్తోంది. ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరకు సరఫరా నిలిచిపోయింది. దీంతో ఉన్న ఒకటి, రెండు రకాల మద్యాన్ని మాత్రమే విక్రయిస్తున్నారు. దీంతో మందుబాబులు తమకు కావాల్సిన బ్రాండ్‌ల కోసం బార్‌ల వైపు పరుగులు తీస్తున్నారు. కౌంటర్‌సేల్స్‌కు తాకిడిపెరగడంతో ఇదే అదనుగా బార్‌ల నిర్వాహకులు ఎంఆర్‌పీల కంటే అధికంగా వసూలు చేసి జేబులు నింపుకుంటున్నారు.

జిల్లాలో ప్రస్తుతం 132 ప్రభుత్వ మద్యం దుకాణాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యంపాలసీని ప్రకటించడంతో ఇవి రద్దుకాబోతున్నాయి. ఈనెల 14న ప్రైవేటు మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహించి 16 నుంచి కొత్త దుకాణాల్లో విక్రయాలకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఎక్సైజ్ అధికారులంతా ప్రైవేటు మద్యం దుకాణాలకు వచ్చే దరఖాస్తుల స్వీకరణ, దరఖాస్తుదారులకు అనుమానాల నివృత్తి, లాటరీకి సంబంధించిన ప్రక్రియపై అవగాహన కల్పించడం, లాటరీ రోజున అవసరమైన ఏర్పాట్లు వంటి అంశాల్లో బిజీగా ఉంటున్నారు. దీనివల్ల మద్యం డిపోల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరకు సరఫరాపై దృష్టిపెట్టడానికి అవకాశం ఉండడం లేదు. పైగా ఈనెల 15తో దుకాణాలను మూసేయాల్సి రావడంతో అదనపు సరకుని దుకాణాలకు పంపినా తిరిగి వెనక్కి తీసుకురావడం, వాటికి సంబంధించిన లెక్కలు అధికారులకు తలనొప్పిగా మారుతుందనే భావన ఉంది. వీటన్నింటి కారణంగా ప్రభుత్వ మద్యం దుకాణాలకు సరకు సరఫరాను నిలిపేశారు. దుకాణంలో ఉన్న సరకునే విక్రయించాలని



... మిగతా 4వ పేజీలో

‘వ్యాపార సంబంధాలకు సహకరిస్తాం’


పోర్టు అధికారులతో ఆస్ట్రేలియన్ బృందం

విశాఖపట్నం, అక్టోబరు 11: ఆస్ట్రేలియన్ కాన్సులేట్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ డేవిడ్ ఎగుల్స్టన్, ఆస్ట్రేలియన్ హైకమిషన్ ఫస్ట్ సెక్రటరీ గ్రేస్ విలియమ్స్ విశాఖపట్నం పోర్టును శుక్రవారం సందర్శించారు. పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దుబే ఈ బృందానికి సాదరస్వాగతం పలికారు. విశాఖపట్నం పోర్టులో సౌకర్యాలు, అభివృద్ధికి చేపడుతున్న వ్యూహాత్మక కార్యక్రమాలను డిప్యూటీ చైర్‌పర్సన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించారు. భవిష్యత్తులో ఆస్ట్రేలియాతో వ్యాపార సంబంధాలకు అవసరమైన సహకారం అందజేస్తామని తెలియజేశారు. ఆస్ట్రేలియా నుంచి బొగ్గును దిగుమతి చేసుకుంటూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు వినియోగించుకుంటున్నట్టు ఆయన వివరించారు. విశాఖపట్నం పోర్టు ఇచ్చిన ఆతిథ్యానికి ఆస్ట్రేలియన్ బృందం సంతోషం వ్యక్తం చేసింది.

ముందస్తు జాగ్రత్తలతోనే క్యాన్సర్ నివారణ

సీతమ్మధార, అక్టోబరు 11: సీతమ్మధారలోని బాలికల పాపా హోమ్ వసతి గృహంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రి, రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ సంయుక్తంగా శుక్రవారం ఉచిత క్యాన్సర్ నివారణ శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ మురళీకృష్ణ, వైద్య సిబ్బంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 9 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్కులు 40 మంది భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వ్యాధికి గురికాకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేశారు. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ముందు జాగ్రత్తలతో క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చన్నారు. రోటరీక్లబ్ పోర్ట్ సిటీ అధ్యక్షుడు కె.వెంకటరమణ, పాపా హోమ్ అధ్యక్షుడు డి.సూర్య ప్రకాశరావు, కార్యదర్శి వి.ప్రకాశరావు, కోశాధికారి రమేష్ చంద్ జైన్, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సేవలకు ప్రశంస


గ్రంథపాలకులతో సంభాషిస్తున్న కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీధర్

సీతంపేట, అక్టోబరు 11: ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయాన్ని కస్టమ్స్ ముఖ్య కమిషనర్ ఎన్.శ్రీధర్ శుక్రవారం సందర్శించారు. ఉద్యోగార్థులతో మాటాడి దిశానిర్దేశం చేశారు. గ్రంథాలయంలో అందిస్తున్న సేవలను గ్రంథాలయ సొసైటీ ప్రధాన కార్యదర్శి డీఎస్ వర్మ, వైస్ ప్రెసిడెంట్ టీఎస్ఆర్ ప్రసాద్‌లు ఆయనకు వివరించారు. గ్రంథాలయంలో అన్ని విభాగాలను ఎన్.శ్రీధర్ సందర్శించి అందుతున్న సేవలను అభినందించారు. సాంకేతికతను ఉపయోగించి చదువుకునే విద్యార్థులకు వైఫై అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. ఆయన వెంట శ్రావణ్ షిపింగ్ లిమిటెడ్ చైర్మన్ ఎస్.సాంబశివరావు ఉన్నారు.

‘బార్’ల పంట పండింది!

... మొదటి పేజీ తరువాయి

సిబ్బందిని ఆదేశించారు. దీనివల్ల ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఒకటి, రెండు రకాల మద్యం తప్పితే సరకంతా ఖాళీ అయిపోయింది. మద్యం కోసం దుకాణానికి వచ్చే మందుబాబులకు సిబ్బంది సరకులేదని సమాధానం చెబుతుండడంతో వారంతా బార్‌లవైపు పరుగుతీస్తున్నారు. బార్‌ల నిర్వాహకులు ఇదే అదనుగా అధిక ధరలకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. బార్‌లలో కౌంటర్‌సేల్ చేయడానికి వీల్లేనప్పటికీ మందుబాబుల తాకిడి ఎక్కువగా ఉంటుండడంతో నిర్వాహకులు భారీ లాభం వస్తుందనే ఆశతో యథేచ్ఛగా కౌంటర్‌సేల్స్ చేస్తున్నారు. అధికారులు కూడా బార్‌ల నిర్వాహకులకు సహకరిస్తుండడంతో అటువైపు కన్నెత్తిచూడడం లేదు. ఉదాహరణకు రూ.130 ఎంఆర్‌పీ ఉన్న చీప్‌లిక్కర్ క్వార్టర్‌ను రూ.200, రూ.220 ఉన్న ఎంసీ విస్కీ క్వార్టర్ రూ.300, రూ.230 ఉన్న 8పీఎం క్వార్టర్ బాటిల్ రూ.300కి విక్రయిస్తున్నారు. అదే ఫుల్‌బాటిల్ అయితే రూ.250 వరకూ అధికంగా వసూలు చేస్తున్నారు. బార్‌లలో భారీగా రేట్లు పెంచి విక్రయిస్తున్నప్పటికీ మందుబాబులకు మరో అవకాశం లేకపోవడంతో చెప్పిన ధరకు కొనుక్కొని వెళుతున్నారు. దీనిపై అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ దరఖాస్తుల స్వీకరణ బిజీలో ఉన్నందున తనిఖీ చేయలేకపోతున్నామని చెప్పేస్తున్నారు. ఈ నేపథ్యంలో 16వ తేదీ వరకు బార్‌లకు పంటపండినట్టేనని మందుబాబులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మహిషాసురమర్దినిగా దుర్గమ్మ


మాధవధారలో పూజలందుకుంటున్న అమ్మవారు


డాబాగార్డెన్స్ ఉమాదేవి


జ్ఞానాపురం రైల్వే స్టేషన్ వద్ద పూజలో పాల్గొన్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ దంపతులు


కస్తూరినగర్-2, సంజీవయ్య కాలనీలో అన్న సమారాధనలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ సతీష్

మాధవధార, అక్టోబరు 11 ; విశాఖ ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మాధవధార హైస్కూలు దగ్గరి శ్రీ గౌరీ రామలింగేశ్వరాలయ సముదాయంలోని లలితాదేవి శుక్రవారం మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పండితులు విశిష్ట అలంకరణలు చేపట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. 51వ వార్డు సీతన్నగార్డెన్స్ శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో మహిళలు సామూహిక ఆరాధనల్లో పాల్గొన్నారు. బర్మాక్యాంప్ శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో విశిష్ట పూజాభిషేకాలు జరిపారు. యువజన సంఘాలు, ఆటో యూనియన్‌లు, కాలనీ యూత్ సంఘాల ఆధ్వర్యంలో దసరా వేడుకలు కన్నులపండువగా సాగుతున్నాయి. మాధవధార యువజన సమాజం దగ్గరి సాయి విఘ్నేశ్వర అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారి ఉత్సవ రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్ శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో ఉమాదేవి మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, చండీ హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహికంగా శ్రీ లలితా సహస్రనామ పారాయణం చేశారు. అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి దివ్య మంగళహారతులిచ్చారు. ఈవో జీవీ రమాభాయి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, మన్మథరెడ్డి పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: కస్తూరినగర్-2, సంజీవయ్య కాలనీలో జరిగిన అన్న సమారాధన కార్యక్రమాన్ని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ప్రారంభించారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొట్టా రాజు, ఎంవీ రమణ, కృప, సాయి పాల్గొన్నారు.


సీతమ్మధారలో కృష్ణుడి అవతారంలో వెంకటేశ్వరస్వామి


సీతమ్మధారలో మహా సరస్వతిగా దుర్గాదేవి అమ్మవారు

పూర్ణామార్కెట్: కుమ్మరవీధిలో ద్విముఖరూపంలో భక్తులు కొలుస్తున్న విజయదుర్గ పోలమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలమాంబ చెంత విజయవాడ కనకదుర్గమ్మ పూజలందుకుంటుందన్నది భక్తుల విశ్వాసం. తొమ్మిదిరోజులు విజయ దుర్గ పోలమ్మకు భక్తులు నీరాజనాలు పలికారు. ఆది దేవాలయంలో బహుముఖరూపాల శ్రీపోలమాంబ అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

జ్ఞానాపురం: జ్ఞానాపురం రైల్వే స్టేషన్ వద్ద భీమేశ్వర ఆటో టాక్సీ స్టాండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గాదేవి పంచమి రాత్రి పూజ మహోత్సవాల్లో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ పాల్గొని కుంకుమ పూజలు జరిపారు. అనంతరం రూ.80 వేల ఆర్థిక సహాయంతో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సీతమ్మధార: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల ప్రసన్న వెంకటేశ్వర స్వామి, షిరిడి సాయిబాబా, అయ్యప్ప స్వామి దేవాలయంలో వెంకటేశ్వర స్వామిని శ్రీకృష్ణుడి అవతారంలో అలంకరించారు. దుర్గాదేవి అమ్మవారు మహా సరస్వతి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ పురవీధుల్లో గరుడ వాహనంతో ఊరేగించారు. సీతంపేటలోని పార్వతీదేవి అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మద్రిపాలెం: మద్రిపాలెం మహరాణి వీధిలో భవానీ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. జనసేన ఉత్తర నియోజకవర్గ కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో విచ్చేసిన ప్రజలు దుర్గామాత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మాయ ‘లేడీ’

... మొదటి పేజీ తరువాయి

అతడిని పెళ్లి చేసుకోవాలని బెదిరించింది. ఆ తరువాత తనను వదిలించుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని బెదిరించింది. మోసం చేస్తున్నారని గ్రహించిన ఎన్ఆర్ఐ భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును విచారిస్తున్నపుడు చాలా విషయాలు బయటకు వచ్చాయి. ఇవన్నీ పోలీస్ కమిషనర్ దృష్టికి వెళ్లడంతో లోతుగా విచారణ చేశారు. మాయలాడి ఇంతకు ముందు ఇలాంటివి చాలా చేసిందని తేలింది. తాజాగా కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో కూడా ఆమెపై కేసు నమోదైంది. ఇంకో వ్యక్తి నేరుగా పోలీస్ కమిషనర్‌కే ఫోన్ చేసి తన పేరు బయటపెట్టనంటే ఆమె చేసిన మోసం చెబుతానన్నారు. ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.

ముఠా అంతా కలిసే...

జమామీ వెనుక ఒక ముఠా ఉన్నట్టు చెబుతున్నారు. ఆమె అందాన్ని ఎర వేసి డబ్బున్న వారిని ఉచ్చులోకి లాగారు. ఆ తరువాత వారికి డ్రగ్స్ ఇస్తున్నారు. వాటిని వాడటం వల్ల కొందరికి శరీరంపై పొక్కులు వచ్చి అనారోగ్యానికి గురైనట్టు సమాచారం. దీనిపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ముఠా మనీ లాండరింగ్ వ్యవహారాలు కూడా నడుపుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జమామీ నుంచి కారు, లాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. లాప్‌టాప్‌లో ఫోన్ డేటా మొత్తం ఉంది. అందులో వివరాల ద్వారా బాధితులు, ఆమెతో సంబంధం ఉన్నవారి వివరాలపై ఆరా తీస్తున్నారు. అలాగే ఆమె ఫోన్ పే ద్వారా జరిగిన లావాదేవీలను బట్టి ఎక్కడెక్కడి నుంచి డబ్బులు వచ్చాయి?, ఎవరికి వెళ్లాయి? అనేది కూపీ తీస్తున్నారు. ముఠా సభ్యుల వివరాలు కూడా పోలీసుల వద్ద ఉన్నాయి. వారి కోసం వెదుకుతున్నారు. పెళ్లయిన బాధితులు తమ వివరాలు ఎక్కడ బయట పడతాయోనని భయపడుతున్నారు. ఈ కేసులో చాలా విషయాలు బయటకు వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఆమె నేరుగా తన వలలో పడిన వారింటికి రాత్రి పూట వెళ్లి బెదిరించేదని సమాచారం. దీనికి సంబంధించిన ఆధారాలు కూడా పోలీసులకు లభించాయి. ఈ వివరాలపై పోలీసులు ప్రశ్నిస్తే...తన వెనుక పెద్ద పెద్ద అధికారులు ఉన్నారని, మీరే ఇబ్బంది పడతారంటూ తిరిగి భయపెడుతుండడం గమనార్హం. తన కేసు లోతుగా తవ్వితే పెద్దలకే నష్టం అన్నట్టుగా ఆమె వ్యవహరిస్తుండడంతో పోలీసులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. బాధితులు కూడా పేర్లు బయట పెట్టబోమని చెబితేనే ఫిర్యాదు చేసేందుకు ముందుకువస్తామని చెప్పడం గమనార్హం. ఏమి చేసినా బయటకు చెప్పుకోలేని వారినే ఈ ముఠా తెలివిగా టార్గెట్ చేసిందని పోలీసులు భావిస్తున్నారు.

మద్యం దుకాణాలకు పోటెత్తిన దరఖాస్తులు

... మొదటి పేజీ తరువాయి

ఎంట్రీపాస్‌లను స్కానింగ్ చేసిన తర్వాత దరఖాస్తుదారులను లోపలికి పంపిస్తామన్నారు. అనంతరం ఒక దుకాణం తర్వాత మరో దుకాణానికి దరఖాస్తు చేసుకున్న వారిని చిల్డ్రన్ ఎరీనాలోకి అనుమతిస్తామన్నారు. దరఖాస్తుల సీరియల్ నంబరు ఆధారంగా టోకెన్ నంబర్లు ఇచ్చి, వాటిని దరఖాస్తుదారులే ఒక డబ్బాలో వేయాల్సి ఉంటుందని, వాటిని కలెక్టర్ సమక్షంలో కలిపి ఒక టోకెన్‌ను తీస్తామన్నారు. తర్వాత స్టాండ్‌బైగా మరో ఇద్దరని ఎంపిక చేస్తామన్నారు. లాటరీలో దుకాణం దక్కించుకున్న వ్యక్తి అక్కడే మొదటి విడత లైసెన్స్‌ఫీజు చెల్లించి దుకాణం పేరుతో ఒక బ్యాంకు ఖాతాను తెరవాల్సి ఉంటుందన్నారు. అలా 155 దుకాణాలకు మధ్యాహ్నం ఒంటిగంటలోగా లాటరీ ప్రక్రియ పూర్తిచేయాలని భావిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియను బయట కూర్చున్న వారు ప్రత్యక్షంగా వీక్షించేందుకు వీలుగా స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. దుకాణానికి దరఖాస్తు చేసుకున్నవారికి బదులుగా వేరొకరు లాటరీలో పాల్గొనాలంటే వారి నుంచి ఆథరైజేషన్ లెటర్ తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. లాటరీలో పాల్గొనేందుకు వచ్చేవారంతా తమ వాహనాలను ఏపీఐఐసీ మైదానంలో పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

విపత్తుపై విజయం

... మొదటి పేజీ తరువాయి

కి.మీ. వేగంతో వీచిన పెనుగాలులకు వేల సంఖ్యలో వృక్షాలు నేలకూలాయి. జాతీయ రహదారి మొత్తం కూలిన వృక్షాలతో నిండిపోయింది. రవాణా వ్యవస్థ నిలిచిపోయింది. జనజీవనం స్తంభించిపోయింది. ఒక్క విశాఖ నగరంలోనే 50 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. మూడు రోజులు ఉత్తరాంధ్ర మొత్తం కటిక చీకటిలో కాలం గడిపింది. ఆ చీకటిలోనే వెలుగు రేఖలా రాత్రికి రాత్రి విశాఖపట్నం చేరుకున్నారు నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. వారం, పది రోజులు పాటు ఇక్కడే ఉండి ప్రజలకు అవసరమైనవన్నీ సమకూర్చి, జనజీవనం మళ్లీ సాధారణ స్థాయికి చేరిన తరువాతే విజయవాడ తిరిగివెళ్లారు. విశాఖపట్నం చరిత్రను తిరగ రాయడానికే ఆ తుఫాన్ వచ్చిందా?...అన్నట్టుగా నగరం ఇప్పుడు అభివృద్ధి సాధించింది. స్మార్ట్ సిటీగా జాతీయ స్థాయి గుర్తింపు వచ్చింది. స్థూల ఆదాయం లెక్కల పరంగా చూసుకుంటే దేశంలో ఎనిమిదో స్థానంలో నిలిచింది.

పర్యాటక కేంద్రంగా కైలాసగిరి అభివృద్ధి

హుద్‌హుద్ తుఫాన్ దెబ్బకు కైలాసగిరి తీవ్రంగా దెబ్బతింది. కొండపైన ఘాట్‌రోడ్డు ధ్వంసమైంది. రాకపోకలు నిలిచిపోయాయి. అన్నింటినీ పునరుద్ధంచి అధికారులు అనతికాలంలోనే అందుబాటులోకి తెచ్చారు. కైలాసగిరి పునర్నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయం చేసింది. ఇప్పుడు అదే కొండపై స్కైలైన్ సైక్లింగ్, జిప్ లైనర్‌తో గ్లాస్ బ్రిడ్జి కూడా రూపుదిద్దుకుంటోంది. రివాల్వింగ్ రెస్టారెంట్, రాత్రి బస చేసేందుకు కాటేజీలు ఏర్పాటవుతున్నాయి. విశాఖ వచ్చే పర్యాటకులు కైలాసగిరి చూడకుండా వెళ్లలేని విధంగా తీర్చిదిద్దుతున్నారు.

పెట్టని కోటలా తూర్పు నౌకాదళం

ఆంగ్లేయులు తూర్పు తీరాన విశాఖ కేంద్రంగా ఏర్పాటుచేసిన నౌకాదళం హుద్‌హుద్ తుఫాన్‌కు తీవ్రంగా నష్టపోయింది. ఒక్క నేవల్ డాక్‌యార్డు పరిసరాల్లోనే 50 వేలకు పైగా చెట్లు కూలిపోయాయి. రూ.2 వేల కోట్ల నష్టం వాటిల్లింది. నౌకాదళ సిబ్బంది ఒక వైపు వారి స్థావరాల్లో పునరుద్ధరణ పనులు చేస్తూనే మరో వైపు ఉత్తరాంధ్ర ప్రజలకు సహాయ సహకారాలు అందించారు. విశాఖ వేదికగా నిర్వహించాల్సిన అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్) తుఫాన్ వల్ల రద్దు అవుతుందని భావించినా నౌకాదళం మొక్కవోని దీక్షతో అతి కొద్ది సమయంలోనే అన్నీ సమకూర్చుకొని ప్రపంచ దేశాలకు ఆతిథ్యం ఇచ్చింది. అందరి ప్రశంసలు అందుకొంది.

పెను తుఫాన్ గాలులకు ఉత్తరాంధ్రాలో ఏడు వేలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు, 60 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 361 సబ్‌స్టేషన్లు పనిచేయకుండా పోయాయి. దాదాపు 12 వేల మంది సిబ్బందిని యుద్ధ ప్రాతిపదికన రంగంలో దించి మూడు రోజుల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. అదే సమయంలో విశాఖలో ఎల్ఈడీ విద్యుద్దీపాలకు అంకురార్పరణ చేశారు. ఆపరేటర్ల అవసరం లేకుండా సాయంత్రం కాగానే దీపాలు వెలిగేలా చంద్రబాబునాయుడు ఏర్పాటుచేయించారు. విశాఖపట్నం పోర్టుకు భారీ నష్టం వాటిల్లింది. 1.5 లక్షల టన్నుల ఎరువులు కరిగిపోయి నీటి పాలయ్యాయి. క్రూడాయిల్ టెర్మినల్ కుంగిపోయింది. దీనివల్ల రూ.200 కోట్ల నష్టం వాటిల్లింది. ఫిషింగ్ హార్బరులో 13 బోట్లు జెట్టీల్లో మునిగిపోయాయి. అనేక బోట్లు ధ్వంసమయ్యాయి. రక్షణ గోడ పడిపోయింది. విశాఖపట్నం విమానాశ్రయం పైకప్పు పూర్తిగా ధ్వంసమైంది. కొన్నిరోజుల పాటు విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే స్టేషన్ పైకప్పులు ఎగిరిపోయాయి. పదుల సంఖ్యలో రైళ్లు రద్దయ్యాయి. పునరుద్ధరణకు చాలా సమయం పట్టింది. హిందూస్థాన్ షిప్‌యార్డుకు చెందిన ఆస్తులకు భారీ నష్టం వాటిల్లింది. డ్రైడాక్ పూర్తిగా ధ్వంసమైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, గీతం యూనివర్సిటీ, కింగ్ జార్జి ఆస్పత్రులకు నష్టం వాటిల్లింది. టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థ ఛిన్నాభిన్నం అయింది. పోయాయి. ఐటీ ఆర్థిక మండళ్లలో పరిశ్రమలకు, ఆర్టీసీకి కోలుకోలేని నష్టం జరిగింది. పంటల పరిస్థితి చెప్పనక్కరల్లేదు. రహదారులె ఎక్కడికక్కడ కోతకు గురయ్యాయి. ప్రభుత్వ అంచనాల ప్రకారం రూ.22 వేల కోట్ల నష్టం జరినట్టు లెక్క తేల్చారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిశ్రమలకు త్వరగా బీమా క్లెయిమ్‌లు వచ్చేలా జాగ్రత్త తీసుకుంది. ఇప్పుడు విశాఖను ఎవరైనా చూస్తే హుద్‌హుద్ వచ్చిన నగరం ఇదే అంటే ఎంత మాత్రం నమ్మరు. అంత అభివృద్ధిని సాధించింది.

విశాఖకు అంతర్జాతీయ గుర్తింపు : ఎమ్మెల్యే గంటా


మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, అక్టోబరు 11 : విశాఖకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు ఐటీ మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన మంత్రి లోకేశ్‌ను తాడేపల్లిలో కలిసి భీమిలి నియోజకవర్గం అభివృద్ధి గురించి చర్చించారు. ఈ సందర్భంగా గంటా ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ టీసీఎస్ క్యాంపస్ ఏర్పాటు ద్వారా పది వేల ఉద్యోగాలు రావడానికి లోకేశ్ చూపించిన చొరవను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని చెప్పారు. ఐటీతో పాటు టూరిజం, ఫార్మా, విద్యా రంగాల అభివృద్ధికి ఉద్దేశించిన ప్రతిపాదనలను ప్రస్తావించారు. బీచ్ రోడ్డును వివిధ జోన్‌లుగా అభివృద్ధి చేస్తే వేలాది మంది స్థానికులకు ఉపాధి కలుగుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి విశాఖ గ్రోత్ ఇంజన్‌లా ఉపకరిస్తుందన్నారు.భోగాపురం ఎయిర్ పోర్టు సిద్ధమయ్యే నాటికి ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్లైఓవర్లు వంటి సమాంతర మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ట్రాఫిక్ సమస్యను అధిగమించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

దుర్గమ్మను దర్శించుకున్న గంటా

భీమునిపట్నం : విజయవాడలోని కనక దుర్గమ్మను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనం చేశారు. ఎమ్మెల్యేతో పాటు సినీ నటుడు, నిర్మాత అశోక్‌కుమార్ కూడా ఉన్నారు.

జీఎంపీ సీ ఫుడ్ కంపెనీ ఎదుట సీపీఎం ధర్నా

ఆనందపురం, అక్టోబరు 11 : మండలంలోని కుసులువాడ పంచాయతీ బాకురువానిపాలెం, చిన్నయ్యపాలెం గ్రామాల మధ్య ఉన్న ఘాన్ మెరైన్ ప్రొడక్ట్స్ (జీఎంపీ) సీ ఫుడ్ కంపెనీ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో స్థానికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా 78వ కార్పొరేటర్, సీపీఎం నాయకుడు బి. గంగారావు మాట్లా డుతూ కంపెనీ నుంచి వస్తున్న వ్యర్థాల వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. కంపెనీ విడుదల చేసే వ్యర్థాలు సాగునీటి కాలువల ద్వారా చిన్నయ్యపాలెం పరిసర ప్రాంతాలకు చేరి, విపరీతమైన దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయని చెప్పారు. కాలువల్లోని నీరు తాగడం వల్ల పశువులు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యర్థాల నీరు బయటకు పంపించకుండా కంపెనీలోనే ఫిల్టర్ చేయాలన్నారు. కాగా కంపెనీ ఎండీ కృష్ణారావు ఆందోళనకారుల వద్దకు వచ్చి వ్యర్థాలు బయటకు రాకుండా చర్యలు తీసుకుంటా మని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు, చిన్నయ్యపాలెం గ్రామస్థులు భీమరాజు, నూకరత్నం, కొప్పల దాలప్ప, కదరాశి అర్జున పాల్గొన్నారు.

బ్రెయిన్ డెడ్ యువకుడు అవయవ దానం


నరేశ్ పట్నాయక్ (ఫైల్)

ఆరిలోవ, అక్టోబరు 11 : బ్రెయిన్ డెడ్ అయిన యువకుడు అవయవ దానం చేసి మరో అయిదుగురికి ప్రాణదాతగా నిలిచాడు. ఒడిశాలోని పర్లాకిమిడి జిల్లాకు చెందిన నరేశ్ పట్నాయక్ (32) ఈనెల 9న ఇంట్లో స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే అతన్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా బ్రెయిన్‌లో తీవ్ర రక్తస్రావం జరిగినట్టు చెప్పి, మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కిమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈమేరకు అతను శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యులు మృతుడి భార్య, కుటుంబ సభ్యులతో మాట్లాడి, అవయవ దానంపై అవగాహన కల్పించారు. కుటుంబీకులు అంగీకారం తెలపడంతో జీవన్‌ధాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు ఆధ్వర్యంలో వైద్యులు మృతుడి శరీరం నుంచి ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీలు, లివర్ సేకరించారు. వాటిని జీవన్‌ధాన్ ప్రోటోకాల్ ప్రకారం ఐదుగురికి కేటాయించినట్టు డాక్టర్ రాంబాబు తెలిపారు.

అప్పుఘర్ బీచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 11 : అప్పుఘర్ సముద్ర తీరానికి శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. మృతుడికి సుమారు 45 ఏళ్లు ఉంటాయని, నల్లని జీన్ ఫ్యాంటు, నలుపు, తెలుపు చార లతో షర్టు ధరించి ఉన్నట్టు పోలీసులు తెలిపారు. జీవీఎంసీ లైఫ్ గార్డులు మృతదేహాన్ని బయటకు తీసి, పోలీసులకు అప్పగించారు. లైఫ్ గార్డులు పవన్ కుమార్, బుజ్జి, నవీన్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి అభినందించారు.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని వైద్య విద్యార్థిని దుర్మరణం

ఆరిలోవ, అక్టోబరు 11 : ఎండాడ పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థిని దుర్మారణం చెందింది. ద్వారకా ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం.. నగరంలోని అల్లిపురంనకు చెందిన పందిరి కనకేశ్, కాంచన దంపతులకు ఇద్దరు కుమార్తెలు. కాంచన తల్లి ఎండాడలో నివసిస్తోంది. ఆమెకు అనారోగ్యం కావడంతో కాంచన, తన రెండో కుమార్తె నిశ్చిత (20)తో కలిసి స్కూటీపై పరామర్శకు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా ఎండాడ పెట్రోల్ బంక్ దాటిన తరువాత అదే మార్గంలో వస్తున్న ఆయిల్ ట్యాంకర్‌కు స్కూటీ హ్యాండిల్ తగలడంతో అదుపు తప్పి బోల్తా పడ్డారు. స్కూటీ వెనుక కూర్చున్న నిశ్చిత రోడ్డుపై పడిపోవడంతో ట్యాంకర్ ఆమె తలపై నుంచి వెళ్లింది. దీంతో ఆమె అక్కడికక్కడే దుర్మరణం చెందగా, కాంచనకు తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా నిశ్చిత ఎన్ఆర్ఐ కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కాంచన పద్మనాభంలో ఉపాధ్యాయినిగా పనిచేస్తుండగా, కనకేశ్ హెచ్ఎంగా పనిచేస్తున్నారు. ఆరిలోవ ఎస్ఐ రామ్‌దాసు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో దీపారాధన

ఆరిలోవ, అక్టోబరు 11 : చినగదిలిలోని నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం సాయంత్రం ఐదు గంటలకు 18 వేల దీపాలు వెలగించనున్నట్టు ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ వానపల్లి అప్పారావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయాన్ని నిర్మించి 30 ఏళ్లు పూర్తి కావడంతో కొబ్బరి నూనెతో దీపారాధన చేస్తున్నామ న్నారు. కార్యక్రమానికి జీవీఎంసీ అదనపు కమిషనర్ సోమన్నారాయణ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్టు చెప్పారు.

14న ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

భీమునిపట్నం (రూరల్) : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరుకానున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు డీఏఎన్ రాజు తెలిపారు. శుక్రవారం అయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ వారం జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, స్వయంగా ఫిర్యాదులు స్వీకరిస్తారని చెప్పారు. ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందని ఆయన చెప్పారు.

శమీ పూజకు పూదోట ముస్తాబు


ముస్తాబైన మండపం

సింహాచలం,అక్టోబరు 11 : సింహగిరిపై ఈనెల 13న జరిగే శమీ పూజకు కొండదిగువ పూదోట సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. స్వామివారు కొండ దిగువకు వచ్చే మెట్లమార్గంలోని నాచును తీసి, రాళ్లు, చెత్త తొలగించి శుభ్రపరిచారు. అలాగే ఉత్సవం జరిగే స్వామివారి పూదోట ప్రధాన ద్వారానికి, గోడలకు అందమైన రంగులు అద్దారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేస్తున్నారు. పూదోట చుట్టూ పెరిగిన తుప్పలు తొలగించడంతో పాటు పూజ చేసే శమీ వృక్షం చుట్టూ అలంకరణలు చేపడుతున్నారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి

సింహాచలం, అక్టోబరు 11 : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం అమ్మవార్ల తిరువీధి వైభవంగా నిర్వహించారు. సువర్ణ, చతుర్భుజి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచారు. ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ బేడామండపంలో తిరువీధి ఉత్సవం జరిపారు.

విదేశీయుల సందడి

సింహాచలం, అక్టోబరు 11 : వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆస్ట్రేలియా దేశానికి పలువురు పర్యాటకులు శుక్రవారం దర్శించుకున్నారు. వారిలో కొందరు ఘాట్‌రోడ్డులో కాలినడకన సింహగిరికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ఉచిత ప్రసాదాన్ని స్వీకరించారు.

నోటీసు

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకమునకూ తెలియజేయునది ఏమనగా నాయొక్క ఒకానొక క్లయింట్ ఈ దిగువ ఉదహరించిన షెడ్యూల్ దాఖల అస్తి ఫ్లాట్‌ను శ్రీ.వేదుల సూర్యనారాయణ మూర్తి నుండి క్రయము చేయుటకు నిర్ణయించుకుని యున్నారు. కాగా సదరు ఆస్తిని రిజిస్టర్ డాక్యుమెంట్ నెం.6183/2016 తేదీ. 26/12/2016 ప్రకారం వారియొక్క పూర్తి హక్కుభుక్తములో, ఆధీనమునందు ఉన్నదనియూ, మరియు ఇతరులు ఎవరికి సదరు ఆస్తిపైన ఎటువంటి హక్కులు లేవనియు, నిర్వివాద నిష్కేటీ ఆస్తి అనియూ, మమ్ములను నమ్మించి యున్నారు. కావున లోకులెవరికైననూ షెడ్యూలు ఆస్తిపై అభ్యంతరములుగానీ, హక్కులు గానీ ఉండిన ఎడల ఈ నోటీసు ప్రచురితము అయిన 14 దినముల లోపు లిఖిత పూర్వకముగా వారికి గల దస్తావేజులను చూపుతూ ఈ దిగువ నా చిరునామాకు తెలియచేయవలెను. లేనిచో షెడ్యూలు ఆస్తిపై శ్రీ.వేదుల సూర్యనారాయణ మూర్తి గారికి మాత్రమే పూర్తి హక్కుదారులుగా భావించి నా క్లయింట్ వారి నుండి ఆస్తిని క్రయము పొందగలవారు. అపై వచ్చు ఎటువంటి లావాదేవీలకు నా క్లయింట్ యొక్క హక్కులను బంధింప జాలవు.

షెడ్యూల్

ఫ్లాట్ నెం.503, డోర్ నెం. 49-26-3, "సాయి సుందర్ రెసిడెన్సీ", 4వ అంతస్తు, మధురానగర్, T.S.No.28/6-B, అల్లిపురం వార్డ్ గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ పరిధి, విశాఖపట్నం.

విశాఖపట్నం.
తేది.10-10-2024

Ms. A. SAI MOUNIKA, Advocate
D.No.16-1-22, Maharanipeta,
Visakhapatnam-02. Cell: 8977559395

'వ్యాపార సంబంధాలకు సహకరిస్తాం'


పోర్టు అధికారులతో ఆస్ట్రేలియన్ బృందం

విశాఖపట్నం, అక్టోబరు 11: ఆస్ట్రేలియన్ కాన్సులేట్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ డేవిడ్ ఎగుల్స్టన్, ఆస్ట్రేలియన్ హైకమిషన్ ఫస్ట్ సెక్రటరీ గ్రేస్ విలియమ్స్ విశాఖపట్నం పోర్టును శుక్రవారం సందర్శించారు. పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దుబే ఈ బృందానికి సాదరస్వాగతం పలికారు. విశాఖపట్నం పోర్టులో సౌకర్యాలు, అభివృద్ధికి చేపడుతున్న వ్యూహాత్మక కార్యక్రమాలను డిప్యూటీ చైర్‌పర్సన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించారు. భవిష్యత్తులో ఆస్ట్రేలియాతో వ్యాపార సంబంధాలకు అవసరమైన సహకారం అందజేస్తామని తెలియజేశారు. ఆస్ట్రేలియా నుంచి బొగ్గును దిగుమతి చేసుకుంటూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు వినియోగించుకుంటున్నట్టు ఆయన వివరించారు. విశాఖపట్నం పోర్టు ఇచ్చిన ఆతిథ్యానికి ఆస్ట్రేలియన్ బృందం సంతోషం వ్యక్తం చేసింది.

ముందస్తు జాగ్రత్తలతోనే క్యాన్సర్ నివారణ

సీతమ్మధార, అక్టోబరు 11: సీతమ్మధారలోని బాలికల పాపా హోమ్ వసతి గృహంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆసుపత్రి, రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ సంయుక్తంగా శుక్రవారం ఉచిత క్యాన్సర్ నివారణ శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ మురళీకృష్ణ, వైద్య సిబ్బంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 9 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్కులు 40 మంది భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వ్యాధికి గురికాకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేశారు. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ముందు జాగ్రత్తలతో క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చన్నారు. రోటరీక్లబ్ పోర్ట్ సిటీ అధ్యక్షుడు కె.వెంకటరమణ, పాపా హోమ్ అధ్యక్షుడు డి.సూర్య ప్రకాశరావు, కార్యదర్శి వి.ప్రకాశరావు, కోశాధికారి రమేష్ చంద్ జైన్, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సేవలకు ప్రశంస


గ్రంథపాలకులతో సంభాషిస్తున్న కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీధర్

సీతంపేట, అక్టోబరు 11: ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయాన్ని కస్టమ్స్ ముఖ్య కమిషనర్ ఎన్.శ్రీధర్ శుక్రవారం సందర్శించారు. ఉద్యోగార్థులతో మాటాడి దిశానిర్దేశం చేశారు. గ్రంథాలయంలో అందిస్తున్న సేవలను గ్రంథాలయ సొసైటీ ప్రధాన కార్యదర్శి డీఎస్ వర్మ, వైస్ ప్రెసిడెంట్ టీఎస్ఆర్ ప్రసాద్‌లు ఆయనకు వివరించారు. గ్రంథాలయంలో అన్ని విభాగాలను ఎన్.శ్రీధర్ సందర్శించి అందుతున్న సేవలను అభినందించారు. సాంకేతికతను ఉపయోగించి చదువుకునే విద్యార్థులకు వైఫై అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. ఆయన వెంట శ్రావణ్ షిపింగ్ లిమిటెడ్ చైర్మన్ ఎస్.సాంబశివరావు ఉన్నారు.

'బార్'ల పంట పండింది!

... మొదటి పేజీ తరువాయి

సిబ్బందిని ఆదేశించారు. దీనివల్ల ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఒకటి, రెండు రకాల మద్యం తప్పితే సరకంతా ఖాళీ అయిపోయింది. మద్యం కోసం దుకాణానికి వచ్చే మందుబాబులకు సిబ్బంది సరకులేదని సమాధానం చెబుతుండడంతో వారంతా బార్‌లవైపు పరుగుతీస్తున్నారు. బార్‌ల నిర్వాహకులు ఇదే అదనుగా అధిక ధరలకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. బార్‌లలో కౌంటర్‌సేల్ చేయడానికి వీల్లేనప్పటికీ మందుబాబుల తాకిడి ఎక్కువగా ఉంటుండడంతో నిర్వాహకులు భారీ లాభం వస్తుందనే ఆశతో యథేచ్ఛగా కౌంటర్‌సేల్స్ చేస్తున్నారు. అధికారులు కూడా బార్‌ల నిర్వాహకులకు సహకరిస్తుండడంతో అటువైపు కన్నెత్తిచూడడం లేదు. ఉదాహరణకు రూ.130 ఎంఆర్‌పీ ఉన్న చీప్‌లిక్కర్ క్వార్టర్‌ను రూ.200, రూ.220 ఉన్న ఎంసీ విస్కీ క్వార్టర్ రూ.300, రూ.230 ఉన్న 8పీఎం క్వార్టర్ బాటిల్ రూ.300కి విక్రయిస్తున్నారు. అదే ఫుల్‌బాటిల్ అయితే రూ.250 వరకూ అధికంగా వసూలు చేస్తున్నారు. బార్‌లలో భారీగా రేట్లు పెంచి విక్రయిస్తున్నప్పటికీ మందుబాబులకు మరో అవకాశం లేకపోవడంతో చెప్పిన ధరకు కొనుక్కొని వెళుతున్నారు. దీనిపై అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ దరఖాస్తుల స్వీకరణ బిజీలో ఉన్నందున తనిఖీ చేయలేకపోతున్నామని చెప్పేస్తున్నారు. ఈ నేపథ్యంలో 16వ తేదీ వరకు బార్‌లకు పంటపండినట్టేనని మందుబాబులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మహిషాసురమర్దినిగా దుర్గమ్మ


మాధవధారలో పూజలందుకుంటున్న అమ్మవారు


డాబాగార్డెన్స్ ఉమాదేవి


జ్ఞానాపురం 'రైల్వే స్టేషన్ వద్ద పూజలో పాల్గొన్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ దంపతులు


కస్తూరినగర్-2, సంజీవయ్య కాలనీలో అన్న సమారాధనలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ సతీష్

మాధవధార, అక్టోబరు 11 ; విశాఖ ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మాధవధార హైస్కూలు దగ్గరి శ్రీ గౌరీ రామలింగేశ్వరాలయ సముదాయంలోని లలితాదేవి శుక్రవారం మహిషాసురమర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పండితులు విశిష్ట అలంకరణలు చేపట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. 51వ వార్డు సీతన్నగార్డెన్స్ శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో మహిళలు సామూహిక ఆరాధనల్లో పాల్గొన్నారు. బర్మాక్యాంప్ శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో విశిష్ట పూజాభిషేకాలు జరిపారు. యువజన సంఘాలు, ఆటో యూనియన్‌లు, కాలనీ యూత్ సంఘాల ఆధ్వర్యంలో దసరా వేడుకలు కన్నులపండువగా సాగుతున్నాయి. మాధవధార యువజన సమాజం దగ్గరి సాయి విఘ్నేశ్వర అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారి ఉత్సవ రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.


సీతమ్మధారలో కృష్ణుడి అవతారంలో వెంకటేశ్వరస్వామి


సీతమ్మధారలో మహా సరస్వతిగా దుర్గాదేవి అమ్మవారు

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్ శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో ఉమాదేవి మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, చండీ హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహికంగా శ్రీ లలితా సహస్రనామ పారాయణం చేశారు. అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి దివ్య మంగళహారతులిచ్చారు. ఈవో జీవీ రమాభాయి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, మన్మథరెడ్డి పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: కస్తూరినగర్-2, సంజీవయ్య కాలనీలో జరిగిన అన్న సమారాధన కార్యక్రమాన్ని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ప్రారంభించారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొట్టా రాజు, ఎంవీ రమణ, కృప, సాయి పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్: కుమ్మరవీధిలో ద్విముఖరూపంలో భక్తులు కొలుస్తున్న విజయదుర్గ పోలమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలమాంబ చెంత విజయవాడ కనకదుర్గమ్మ పూజలందుకుంటుందన్నది భక్తుల విశ్వాసం. తొమ్మిదిరోజులు విజయ దుర్గ పోలమ్మకు భక్తులు నీరాజనాలు పలికారు. ఆది దేవాలయంలో బహుముఖరూపాల శ్రీపోలమాంబ అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

జ్ఞానాపురం: జ్ఞానాపురం రైల్వే స్టేషన్ వద్ద భీమేశ్వర ఆటో టాక్సీ స్టాండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దుర్గాదేవి పంచమి రాత్రి పూజ మహోత్సవాల్లో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమా శ్రీధర్ పాల్గొని కుంకుమ పూజలు జరిపారు. అనంతరం రూ.80 వేల ఆర్థిక సహాయంతో అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సీతమ్మధార: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల ప్రసన్న వెంకటేశ్వర స్వామి, షిరిడి సాయిబాబా, అయ్యప్ప స్వామి దేవాలయంలో వెంకటేశ్వర స్వామిని శ్రీకృష్ణుడి అవతారంలో అలంకరించారు. దుర్గాదేవి అమ్మవారు మహా సరస్వతి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ పురవీధుల్లో గరుడ వాహనంతో ఊరేగించారు. సీతంపేటలోని పార్వతీదేవి అమ్మవారు మహిషాసురమర్ధిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మద్రిపాలెం: మద్రిపాలెం మహరాణి వీధిలో భవానీ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. జనసేన ఉత్తర నియోజకవర్గ కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో విచ్చేసిన ప్రజలు దుర్గామాత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మాయ 'లేడీ'

... మొదటి పేజీ తరువాయి

అతడిని పెళ్లి చేసుకోవాలని బెదిరించింది. ఆ తరువాత తనను వదిలించుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని బెదిరించింది. మోసం చేస్తున్నారని గ్రహించిన ఎన్ఆర్ఐ భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును విచారిస్తున్నపుడు చాలా విషయాలు బయటకు వచ్చాయి. ఇవన్నీ పోలీస్ కమిషనర్ దృష్టికి వెళ్లడంతో లోతుగా విచారణ చేశారు. మాయలాడి ఇంతకు ముందు ఇలాంటివి చాలా చేసిందని తేలింది. తాజాగా కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో కూడా ఆమెపై కేసు నమోదైంది. ఇంకో వ్యక్తి నేరుగా పోలీస్ కమిషనర్‌కే ఫోన్ చేసి తన పేరు బయటపెట్టనంటే ఆమె చేసిన మోసం చెబుతానన్నారు. ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.

ముఠా అంతా కలిసే...

జమామీ వెనుక ఒక ముఠా ఉన్నట్టు చెబుతున్నారు. ఆమె అందాన్ని ఎర వేసి డబ్బున్న వారిని ఉచ్చులోకి లాగారు. ఆ తరువాత వారికి డ్రగ్స్ ఇస్తున్నారు. వాటిని వాడటం వల్ల కొందరికి శరీరంపై పొక్కులు వచ్చి అనారోగ్యానికి గురైనట్టు సమాచారం. దీనిపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ముఠా మనీ లాండరింగ్ వ్యవహారాలు కూడా నడుపుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జమామీ నుంచి కారు, లాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. లాప్‌టాప్‌లో ఫోన్ డేటా మొత్తం ఉంది. అందులో వివరాల ద్వారా బాధితులు, ఆమెతో సంబంధం ఉన్నవారి వివరాలపై ఆరా తీస్తున్నారు. అలాగే ఆమె ఫోన్ పే ద్వారా జరిగిన లావాదేవీలను బట్టి ఎక్కడెక్కడి నుంచి డబ్బులు వచ్చాయి?, ఎవరికి వెళ్లాయి? అనేది కూపీ తీస్తున్నారు. ముఠా సభ్యుల వివరాలు కూడా పోలీసుల వద్ద ఉన్నాయి. వారి కోసం వెదుకుతున్నారు. పెళ్లయిన బాధితులు తమ వివరాలు ఎక్కడ బయట పడతాయోనని భయపడుతున్నారు. ఈ కేసులో చాలా విషయాలు బయటకు వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఆమె నేరుగా తన వలలో పడిన వారింటికి రాత్రి పూట వెళ్లి బెదిరించేదని సమాచారం. దీనికి సంబంధించిన ఆధారాలు కూడా పోలీసులకు లభించాయి. ఈ వివరాలపై పోలీసులు ప్రశ్నిస్తే...తన వెనుక పెద్ద పెద్ద అధికారులు ఉన్నారని, మీరే ఇబ్బంది పడతారంటూ తిరిగి భయపెడుతుండడం గమనార్హం. తన కేసు లోతుగా తవ్వితే పెద్దలకే నష్టం అన్నట్టుగా ఆమె వ్యవహరిస్తుండడంతో పోలీసులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. బాధితులు కూడా పేర్లు బయట పెట్టబోమని చెబితేనే ఫిర్యాదు చేసేందుకు ముందుకువస్తామని చెప్పడం గమనార్హం. ఏమి చేసినా బయటకు చెప్పుకోలేని వారినే ఈ ముఠా తెలివిగా టార్గెట్ చేసిందని పోలీసులు భావిస్తున్నారు.

మద్యం దుకాణాలకు పోటెత్తిన దరఖాస్తులు

... మొదటి పేజీ తరువాయి

ఎంట్రీపాస్‌లను స్కానింగ్ చేసిన తర్వాత దరఖాస్తుదారులను లోపలికి పంపిస్తామన్నారు. అనంతరం ఒక దుకాణం తర్వాత మరో దుకాణానికి దరఖాస్తు చేసుకున్న వారిని చిల్డ్రన్ ఎరీనాలోకి అనుమతిస్తామన్నారు. దరఖాస్తుల సీరియల్ నంబరు ఆధారంగా టోకెన్ నంబర్లు ఇచ్చి, వాటిని దరఖాస్తుదారులే ఒక డబ్బాలో వేయాల్సి ఉంటుందని, వాటిని కలెక్టర్ సమక్షంలో కలిపి ఒక టోకెన్‌ను తీస్తామన్నారు. తర్వాత స్టాండ్‌బైగా మరో ఇద్దరిని ఎంపిక చేస్తామన్నారు. లాటరీలో దుకాణం దక్కించుకున్న వ్యక్తి అక్కడే మొదటి విడత లైసెన్స్‌ఫీజు చెల్లించి దుకాణం పేరుతో ఒక బ్యాంకు ఖాతాను తెరవాల్సి ఉంటుందన్నారు. అలా 155 దుకాణాలకు మధ్యాహ్నం ఒంటిగంటలోగా లాటరీ ప్రక్రియ పూర్తిచేయాలని భావిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియను బయట కూర్చున్న వారు ప్రత్యక్షంగా వీక్షించేందుకు వీలుగా స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. దుకాణానికి దరఖాస్తు చేసుకున్నవారికి బదులుగా వేరొకరు లాటరీలో పాల్గొనాలంటే వారి నుంచి ఆథరైజేషన్ లెటర్ తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. లాటరీలో పాల్గొనేందుకు వచ్చేవారంతా తమ వాహనాలను ఏపీఐఐసీ మైదానంలో పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

విపత్తుపై విజయం

... మొదటి పేజీ తరువాయి

కి.మీ. వేగంతో వీచిన పెనుగాలులకు వేల సంఖ్యలో వృక్షాలు నేలకూలాయి. జాతీయ రహదారి మొత్తం కూలిన వృక్షాలతో నిండిపోయింది. రవాణా వ్యవస్థ నిలిచిపోయింది. జనజీవనం స్తంభించిపోయింది. ఒక్క విశాఖ నగరంలోనే 50 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. మూడు రోజులు ఉత్తరాంధ్ర మొత్తం కటిక చీకటిలో కాలం గడిపింది. ఆ చీకటిలోనే వెలుగు రేఖలా రాత్రికి రాత్రి విశాఖపట్నం చేరుకున్నారు నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. వారం, పది రోజులు పాటు ఇక్కడే ఉండి ప్రజలకు అవసరమైనవన్నీ సమకూర్చి, జనజీవనం మళ్లీ సాధారణ స్థాయికి చేరిన తరువాతే విజయవాడ తిరిగివెళ్లారు. విశాఖపట్నం చరిత్రను తిరగ రాయడానికే ఆ తుఫాన్ వచ్చిందా?...అన్నట్టుగా నగరం ఇప్పుడు అభివృద్ధి సాధించింది. స్మార్ట్ సిటీగా జాతీయ స్థాయి గుర్తింపు వచ్చింది. స్థూల ఆదాయం లెక్కల పరంగా చూసుకుంటే దేశంలో ఎనిమిదో స్థానంలో నిలిచింది.

పర్యాటక కేంద్రంగా కైలాసగిరి అభివృద్ధి

హుద్‌హుద్ తుఫాన్ దెబ్బకు కైలాసగిరి తీవ్రంగా దెబ్బతింది. కొండపైన ఘాట్‌రోడ్డు ధ్వంసమైంది. రాకపోకలు నిలిచిపోయాయి. అన్నింటినీ పునరుద్ధించి అధికారులు అనతికాలంలోనే అందుబాటులోకి తెచ్చారు. కైలాసగిరి పునర్నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయం చేసింది. ఇప్పుడు అదే కొండపై స్కైలైన్ సైక్లింగ్, జిప్ లైనర్‌తో గ్లాస్ బ్రిడ్జి కూడా రూపుదిద్దుకుంటోంది. రివాల్వింగ్ రెస్టారెంట్, రాత్రి బస చేసేందుకు కాటేజీలు ఏర్పాటవుతున్నాయి. విశాఖ వచ్చే పర్యాటకులు కైలాసగిరి చూడకుండా వెళ్లలేని విధంగా తీర్చిదిద్దుతున్నారు.

పెట్టని కోటలా తూర్పు నౌకాదళం

ఆంగ్లేయులు తూర్పు తీరాన విశాఖ కేంద్రంగా ఏర్పాటుచేసిన నౌకాదళం హుద్‌హుద్ తుఫాన్‌కు తీవ్రంగా నష్టపోయింది. ఒక్క నేవల్ డాక్‌యార్డు పరిసరాల్లోనే 50 వేలకు పైగా చెట్లు కూలిపోయాయి. రూ.2 వేల కోట్ల నష్టం వాటిల్లింది. నౌకాదళ సిబ్బంది ఒక వైపు వారి స్థావరాల్లో పునరుద్ధరణ పనులు చేస్తూనే మరో వైపు ఉత్తరాంధ్ర ప్రజలకు సహాయ సహకారాలు అందించారు. విశాఖ వేదికగా నిర్వహించాల్సిన అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్) తుఫాన్ వల్ల రద్దు అవుతుందని భావించినా నౌకాదళం మొక్కవోని దీక్షతో అతి కొద్ది సమయంలోనే అన్నీ సమకూర్చుకొని ప్రపంచ దేశాలకు ఆతిథ్యం ఇచ్చింది. అందరి ప్రశంసలు అందుకొంది.

పెను తుఫాన్ గాలులకు ఉత్తరాంధ్రాలో ఏడు వేలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు, 60 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 361 సబ్‌స్టేషన్లు పనిచేయకుండా పోయాయి. దాదాపు 12 వేల మంది సిబ్బందిని యుద్ధ ప్రాతిపదికన రంగంలో దించి మూడు రోజుల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. అదే సమయంలో విశాఖలో ఎల్ఈడీ విద్యుద్దీపాలకు అంకురార్పణ చేశారు. ఆపరేటర్ల అవసరం లేకుండా సాయంత్రం కాగానే దీపాలు వెలిగేలా చంద్రబాబునాయుడు ఏర్పాటుచేయించారు. విశాఖపట్నం పోర్టుకు భారీ నష్టం వాటిల్లింది. 1.5 లక్షల టన్నుల ఎరువులు కరిగిపోయి నీటి పాలయ్యాయి. క్రూడాయిల్ టెర్మినల్ కుంగిపోయింది. దీనివల్ల రూ.200 కోట్ల నష్టం వాటిల్లింది. ఫిషింగ్ హార్బరులో 13 బోట్లు జెట్టీల్లో మునిగిపోయాయి. అనేక బోట్లు ధ్వంసమయ్యాయి. రక్షణ గోడ పడిపోయింది. విశాఖపట్నం విమానాశ్రయం పైకప్పు పూర్తిగా ధ్వంసమైంది. కొన్నిరోజుల పాటు విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే స్టేషన్ పైకప్పులు ఎగిరిపోయాయి. పదుల సంఖ్యలో రైళ్లు రద్దయ్యాయి. పునరుద్ధరణకు చాలా సమయం పట్టింది. హిందూస్థాన్ షిప్‌యార్డుకు చెందిన ఆస్తులకు భారీ నష్టం వాటిల్లింది. డ్రైడాక్ పూర్తిగా ధ్వంసమైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, గీతం యూనివర్సిటీ, కింగ్ జార్జి ఆస్పత్రులకు నష్టం వాటిల్లింది. టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థ ఛిన్నాభిన్నం అయింది. పోయాయి. ఐటీ ఆర్థిక మండళ్లలో పరిశ్రమలకు, ఆర్టీసీకి కోలుకోలేని నష్టం జరిగింది. పంటల పరిస్థితి చెప్పనక్కరలేదు. రహదారులె ఎక్కడికక్కడ కోతకు గురయ్యాయి. ప్రభుత్వ అంచనాల ప్రకారం రూ.22 వేల కోట్ల నష్టం జరినట్టు లెక్క తేల్చారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిశ్రమలకు త్వరగా బీమా క్లెయిమ్‌లు వచ్చేలా జాగ్రత్త తీసుకుంది. ఇప్పుడు విశాఖను ఎవరైనా చూస్తే హుద్‌హుద్ వచ్చిన నగరం ఇదే అంటే ఎంత మాత్రం నమ్మరు. అంత అభివృద్ధిని సాధించింది.

యథేచ్ఛగా చెరువుల ఆక్రమణ

» పెందుర్తిలో పలుచోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టిన అక్రమార్కులు

పెందుర్తి, అక్టోబరు 11: పెందుర్తి రెవెన్యూ పరిధిలోని, చెరువులను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. ఈ ఆక్రమిత స్థలాల్లో ఇళ్లు ఊళ్లను తలపించేలా కనిపిస్తున్నాయి. జల వనరుల (వాటర్ బాడీస్) సంరక్షణ చట్టాన్ని సవాల్ చేస్తూ మరీ చెరువులను ఎవరికి వారు సొంతం చేసుకుంటున్నారు. ఈక్రమంలో పెందుర్తిలో సర్వే నంబర్ 230లో 20 ఎకరాల విస్తీర్ణం గల ఉన్న గోకాడ చెరువు ఆక్రమణలతో కుచించుకుపోయింది. కబ్జాదారుల తీరుతో దీని రూపురేఖలు కనుమరుగయ్యే దుస్థితి నెలకొంది. సుమారు 20ఎకరాల్లో పది ఎకరాలు పైగా ఆక్రమణకు గురైందని రెవెన్యూ వర్గాలే చెబుతున్నాయి ఈవిధంగా చెరువును ఆక్రమించి సుమారు 50 ఇళ్లు నిర్మించినట్టు తెలుస్తోంది. పెందుర్తిలో గల 120లో 6.85 ఎకరాల విస్తీర్ణం గల విజయరామసాగర్ చెరువులో సుమారు రెండెకరాలు స్థలాన్ని ఆక్రమించిన ఓ రియల్ వ్యాపారి కాలనీగా మార్చి సుమారు 40 ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు.చినముషిడివాడలోని సర్వే నంబర్లు 165,185,186, 189లో సుమారు 40 ఎకరాలు, చెరువులో 20ఎకరాలకు పైగా ఆక్రమణకు లోనయ్యాయి. ఈ ఆక్రమణలు చూసిన రెవెన్యూ సిబ్బంది విస్మయం వ్యక్తంచేస్తున్నారు. క్రిష్ణరాయపురం,లక్ష్మీపురంలోని రాముడు చెరువులు ఆక్రమణలతో కు దించుకుపోయాయి

నోటీసులు జారీ చేసినా...

చెరువు ఆక్రమణలపై రెవెన్యూ నోటీసులు జారీ చేసిన వెనక్కి తగ్గడంలేదు. ఈక్రమంలో గత ఏడాదిలో 15 ఎకరాల చెరువుల ఆక్రమణలకు సంబంధించి 414 మందికి జల వనరులు సంరక్షణ (వాటర్ బాడీస్)లో భాగంగా చెరువు, గెడ్డ, వాగు ఆక్రమణలపై రెవెన్యూ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో పట్టణ ప్రాంతంపెందుర్తిలో 257, చినముషిడివాడలో 73, వేపగుంటలో 25, లక్ష్మీపురంలో 8, గ్రామీణ ప్రాంతం సరిపల్లిలో 31, ఎస్ఆర్ పురంలో 14, గు ర్రపాలెంలో ఆరు మొత్తంగా సుమారు 15 ఎకరాలు విస్తీర్ణంలో గల వాటర్ బాడీస్ ఆక్రమించి చేపట్టిన 414 మందికి సెక్షన్ 7 నోటీసులు జారీ చేశారు. నేటి ఏడాదిన్నర దాటుతున్నా వారికి తదుపరి చర్యలు తీసుకోలేదు. తిరిగి కోర్టుకు వెళ్లాలని రెవెన్యూ సిబ్బందే ఆక్రమణదారులకు సలహాలు ఇస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆక్రమణలతో బక్కచిక్కిన చెరువులతో వరదలు వస్తే పెందుర్తి ముంపు బారిన పడే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో ఆక్రమణల తొలగింపులో పక్కాగా చర్యలు తీసుకోవాలని పర్యావరణ పరిరక్షకులు కోరుతున్నారు.


పెందుర్తిలో చెరువుని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు

చెరువుల పరిరక్షణకు చర్యలు



రెవెన్యూ పరిధిలోని చెరువులు పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. కొత్త మార్గదర్శకాలతో పట్టణ ప్రాంతాల్లోని చెరువులను జీవీఎంసీకి అప్పగించి సుందరీకరణ పనులు నిర్వహిం చేలా చర్యలు చేపట్టాలని శాఖపరంగా ఆదేశించారు. దీంతో చెరువులు సంరక్షణ జరుగుతుంది. నీటి వనరులు ఆక్రమించుకుని నిర్మించిన చెరువు ఆక్రమణలపై దృష్టి సారిస్తాం చేశాం.

- తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్

ఉచిత శిక్షణ

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 11: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్, బొల్లినేని మెడిస్కిల్స్ సంయుక్తంగా ఈ ఏడాది ఐదు కోర్సులలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బొల్లినేని మెడి స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.జనరల్ డ్యూటీ అసిస్టెంట్, బ్రైడల్ ఫ్యాషన్ అండ్ పోర్ట్‌ఫోలియో మేకప్ ఆర్టిస్ట్, ఫుడ్ అండ్ బేవరేజస్ సర్వీసెస్, వేర్ హౌస్ డేటా పీడర్, ప్రొడక్షన్ మెషిన్ ఆపరేటర్ కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. పది, ఇంటర్ ఉత్తీర్ణులైన 18 నుంచి 28 ఏళ్ల లోపు యువతీ యువకులకు మూడు నెలల పాటు విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ రెండవ ఫ్లోర్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. ఆసక్తి గలవారు ఫోన్: 91219 99654 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కూటమి ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి


అభివృద్ధి పనులను శంకు స్థాపన చేస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, తదితరులు

అగనంపూడి, అక్టోబరు 11: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే చురుగ్గా అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు 79వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. వార్డు పరిధిలోని స్నేహపురి కాలనీ, దేశపాత్రునిపాలెంలో రూ. 40 లక్షల నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడారు. శివారు గ్రామా ల్లో పూర్తిస్థాయి మౌలిక వసతి కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం జాతీయ రహదారి శ్రీరామ్‌నగర్ కాలనీ వద్ద చేపడుతున్న చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గుడివాడ గురునాథరావు జయంతి


గురునాదరావు కాంస్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 11: ఉత్తరాంధ్ర అభివృద్ధి అహర్నిశలు శ్రమించిన మాజీ మం త్రి గుడివాడ గురునాథరావు ఆశయాల సాధనకు అందరూ కృషిచేయాలని మాజీ రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. మిందిలో శుక్రవారం నిర్వహించిన గురునాథరావు 69వ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తాను అధికారంలో ఉన్నా , ప్రతిపక్షంలో ఉన్నా విశాఖ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, వైసీపీ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, గుడివాడ లతీశ్, ఈటి శ్యామలరావు, సంద్రాన నూకరాజు, వరదాడ రమణ, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులు, పేదలకు అమర్‌నాథ్ దుస్తులు పంపిణీచేశారు.

సినిమా గైడ్

● **శ్వాగ్:** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **దక్షిణ :** కిన్నెర, శారద, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య హెవెన్ (గాజువాక), తాతా (తగరపువలస)

● **రామ్‌నగర్ బన్నీ:** రమాదేవి, విశేష్ (గాజువాక)

● **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)

● **సత్యం సుందరం :** సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు50, టమాటా 48, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 42, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 44, బీరకాయలు 46, ఆనపకాయలు 28, కాలీఫ్లవర్ 44, క్యాబేజ్ 26, క్యారెట్ 48 దొండకాయలు 44, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 82, అల్లం (పాతది) 100, బరబటి 50, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 85, గోరుచిక్కుడు 36, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 100, పొటల్స్ 60, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 62, దేముడు చిక్కుడు 74, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 74, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	118
ఫారం ధర	--	138
విత్ స్కిన్	--	246
స్కిన్‌లెస్	--	256


మర్రిపాలెం రైతుబజారులో నూనె సబ్సిడీ అమ్మకాలను పరిశీలిస్తున్న డీఎస్ఓ

సబ్సిడీ నూనె విక్రయాలు పరిశీలన

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 11: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం రైతుబజారులో సబ్సిడీ నూనె విక్రయ స్టాల్స్‌ను జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కరరావు పరిశీలించారు. బహిరంగమార్కెట్‌లో వంట నూనెల ధరలు అధికంగా ఉండటంతో రైతుబజార్లలో సబ్సిడీపై పామాయిలు కేజీ రూ. 110, క్రిస్టల్ సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124, ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ అయిల్ రూ.124, గోల్డ్ డ్రాప్ సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ. 124కు విక్రయిస్తున్నట్టు ఆయన తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు అదుపులోకి వచ్చేంతవరకు రైతుబజార్లలో నూనె విక్రయాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఈఓ. వరహాలు, సహాయకుడు ప్రతాప్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తగ్గిన టమాటా ధర

గోపాలపట్నం, అక్టోబరు 11: గత కొద్ది రోజులుగా నింగినంటుతున్న టమాటా ధర కాస్త తగ్గుముఖం పట్టింది. మూడు రోజుల క్రితం వరకూ రైతుబజారులో కిలో టమాటా ధర రూ.65 ఉండగా బయట మార్కెట్‌లో కిలో రూ.90 వరకూ విక్రయించారు. దీంతో కిలో టమాటా రూ.50 చొప్పున రైతుబజారుల్లో సబ్సిడీపై టమాటాలు విక్రయాలు చేపట్టారు. కాగా, గురువారం రైతుబజారులో కిలో రూ.48కి లభించడంతో కొనుగోలుదారులు కాస్త ఊరట చెందారు. టమాటా ధర తగ్గుముఖం పట్టడంతో రైతుబజారులో గురువారం సబ్సిడీపై టమాటా విక్రయాలు చేపట్టలేదు. శుక్రవారం సబ్సిడీ టమాటా రైతుబజారులో అందుబాటులో ఉంటుందని ఎస్టేట్ అధికారి నారాయణరావు తెలిపారు. టమాటా ధర మరికాస్త తగ్గుముఖం పట్టే వరకూ సబ్సిడీ కౌంటర్‌లో టమాటా అమ్మకాలు జరిపే అవకాశం ఉన్నట్టు ఉన్నతాధికారులు తెలిపారు.

దసరా కళ తప్పిన మార్కెట్

గాజువాక, అక్టోబరు 11: గాజువాక మార్కెట్ దసరా కళ తప్పింది. పండగ వస్తుందంటే మూడురోజుల ముందునుంచి కిటకిటలాడేది. అలాంటిది ప్రస్తుతం వెలబోయింది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం గాజువాక మార్కెట్‌పై బాగాచూపింది. స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న వారి లో సుమారు 25వేల మంది గాజువాక ప్రాంతంలోనే నివాసముంటున్నారు. ఏటా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు బోనస్ ఇచ్చే వారు. అయితే, ఈ ఏడాది బోనస్ కాదు కదా నెలవారీ జీతం కూడా ఇంత వరకు చెల్లించలేదు. అలాగే, కాంట్రాక్టు కార్మికులకు మూడు నాలుగు నెలలుగా వేతనాలు లేవు. దీంతో మార్కెట్‌లో కొనుగోలు చేసేందుకు ఎ వరూ ముందుకు రావటం లేదు. ఎలక్ట్రానిక్స్, దుస్తులు, వస్తువులు, బైక్‌ల షోరూంలు ఈసారి దసరాకు వెలవెలబోయాయి. స్టీల్‌ప్లాంట్ ప్రభావం వ్యాపారాలపై బాగా పడిందని పలువురు చెబుతున్నారు.

ఎంఎస్ఎంఈ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి

» ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్


తమ్మిరెడ్డి శివ శంకర్‌-సత్కరిస్తున్న వాసీవా, ఐలా సభ్యులు

ఆటోనగర్, అక్టోబరు 11: ఎంఎస్ఎంఈ ప్రోత్సాహకాలను పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ తమ్మిరెడ్డి శివ శంకర్ తెలిపారు. విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసీవాలో నిర్వహించిన పారిశ్రామిక వేత్తల సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ అభివృద్ధి సంస్థ ద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అందించే ప్రోత్సాహకాలను విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. పరిశ్రమల బలోపేతానికి కృషి చేస్తామని, యువతకు ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. యువత పారిశ్రామికంగా అభివృద్ధి చెందితేనే దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధ్యమని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆలోచనలని తెలిపారు. ఈ ఆశయాల సాధనకు కృషి చేస్తానన్నారు. వాసీవా ఆధ్వర్యంలో పారిశ్రామిక వేత్తలు పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్‌గా తొలిసారిగా ఆటోనగర్ వి చ్చేసిన శివశంకర్‌ను వాసీవా, ఐలా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, రామ ప్రసాద్, పరుచూరి ప్రభాకర్, ఐలా చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు కొల్లి ఈశ్వరరావు,సెక్రటరీ చీకటి సత్యన్నారాయణ, లంక బాపిరాజు, ఐలా మాజీ చైర్మన్లు యార్లగడ్డ సాంబశివరావు, ఎన్.శేషగిరిరావు, ఏకే బాలాజీ, పారిశ్రామిక వేత్తలు కొల్లి సత్యనారాయణ, పి.పద్మావతి, ఆట్లూరి రమేష్, నాగిరెడ్డి, కిషోర్, సర్వశుద్ధి సత్య, రామభద్రరాజు, నవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రధాని మోదీ లక్ష్యం


సభ్యత్వ నమోదులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర

గాజువాక, అక్టోబరు 11: దేశంలో ప్రతి ఒక్కరి సంక్షేమమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముందుకు సాగుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. గాజువాక నెలిముక్కులో శుక్రవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ సభ్యత్వం ప్రారంభమైన 40 రోజుల్లో దేశవ్యాప్తంగా 8 కోట్ల మంది సభ్యత్వం తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, నాయ కు లు రోహిణి, దానేశ్, జిలకర్ర రమణ, జగదీష్, మనోహర్ పాల్గొన్నారు.

శమీ పూజకు పూదోట ముస్తాబు


ముస్తాబైన మండపం

సింహాచలం, అక్టోబరు 11 : సింహగిరిపై ఈనెల 13న జరిగే శమీ పూజకు కొండదిగువ పూదోట సర్వాంగ సుందరంగాముస్తాబవుతోంది. స్వామివారు కొండ దిగువకు వచ్చే మెట్లమార్గంలోని నాచు ను తీసి, రాళ్లు, చెత్త తొలగించి శుభ్రపరిచారు. అలాగే ఉత్సవం జరిగే స్వామివారి పూదోట ప్రధానద్వారానికి, గోడలకు అందమైన రంగులు అద్దారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేస్తున్నారు. పూదోట చుట్టూ పెరిగిన తుప్పలు తొలగించడంతో పాటు పూజ చేసే శమీ వృక్షం చుట్టూ అలంకరణలు చేపడుతున్నారు.

విదేశీయుల సందడి

సింహాచలం, అక్టోబరు 11: వరాహలక్ష్మీనృసింహ స్వామిని ఆస్ట్రేలియా దేశానికి పలువురు పర్యాట కులు శుక్రవారం దర్శించుకున్నారు. వారిలో కొందరు ఘాట్‌రోడ్డులో కాలినడకన సింహగిరికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ఉచిత ప్రసాదాన్ని స్వీకరించారు.


అమ్మవారికి పూజలు చేస్తున్న సోమేశ్ దంపతులు


మహాకాళి రూపంలో రాజశ్యామల


శాకంబరిగా సాగర గిరి దుర్గాదేవి


అలివేలు మంగాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పంచకర్ల

ఘనంగా దసరా నవరాత్రి ఉత్సవాలు

మల్కాపురం: మల్కాపురం పద్మశాలి వీధిలో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని 61వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్ సతీమణి సంధ్య దర్శించుకున్నారు. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఉన్న విజయదుర్గ ఆలయంలో ఆర్టీసీ డిపో ప్రధాన కార్యదర్శి పిల్లా శంకరరావు ప్రత్యేక పూజలు చేశారు. యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గను కూ రగాయలతో శాకంబరిగా అలంకరించి పూజలు చేశారు.

వేపగుంట: నాయుడుతోట కృష్ణానగర్ గుడివీధిలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. నాయుడుతోట గాయత్రిదేవి ఆలయంలో అమ్మవారిని పూలతో చతుర్భుజ దుర్గగా అలంకరించారు. రవినగర్ శేషాద్రి కొండపైన కళ్యాణ వెంకటేశ్వరాలయంలో దసరా ఉత్సవాలు పురస్కరించుకొని సామూహిక 108 సార్లు విష్ణు సహస్రనామ పారాయణం ముగిసింది.. వేపగుంట ముత్యాలమ్మను అమ్మవారిని మహిసురమర్దినిగా అలంకరించారు. మధ్యాహ్నం భవానీలకు అన్నసంతర్పణ చేశారు. సేనాతిపాలెం రోళ్ల పైడిమాంబ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శరన్నవరాత్రి వేడుకల్లో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పాల్గొని పూజలుచేశారు. అప్పన్నపాలెం దరి వర్షిణి టవర్స్ జి బ్లాక్‌లో ఆపార్ట్‌మెంట్ వాసులునవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు.


ఎన్.ఎ.డి.జంక్షన్: బుచ్చిరాజుపాలెం దుర్గాలమ్మ, బంగారమ్మ ఆలయంలో కుంకుమపూజలు, అర్చనలు చేశారు. 52వ వార్డు ఎన్.ఎ.డిలో మార్వాడి మంచ్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

పెందుర్తి: చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగాదేవి ఆలయంలో దసరా ఉత్సవాలు సందర్భంగా శుక్రవారం అమ్మవారిని ధనలక్ష్మి అలంకరణలో పూజలు చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే పంచకర్ల పురుషోత్తపురం,సేనాతివానిపాలెం, గొల్లవిల్లిపాలెంలోని దుర్గాదేవి మండపాలను సందర్శించారు. పెందుర్తి వెంకటాద్రి శిఖరం దిగువనున్న మహాకామేశ్వరి ద్వాదశ సహిత జ్యోతిర్లింగాలయంలో అమ్మవారిని మహిషాసుర మర్దిని రూపిణిగా అలంకరించారు. ఎస్ఆర్‌పురంలోని కనకదుర్గ ఆలయంలో ఆలయ ధర్మకర్త కాయితి ఎర్రిబాబు ఆధ్వర్యంలో అమ్మవారిని కాళికాదేవి అలంకరణ చేశారు. చినముషిడివాడలోని శారదాపీఠంలో అధిష్టాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు మహాకాళి భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు శ్రవణా నక్షత్రం వేడుకలు

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కళ్యాణ వెంకటేశ్వరాలయంలో శనివారం స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం వేడుకలు నిర్వహించనున్నట్టు అర్చకుడు శేషాద్రి శర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చన, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, మధ్యాహ్నం అన్నసంతర్పణ చేపట్టనున్నట్టు చెప్పారు.


కృష్ణానగర్ గుడివీధిలో మహిషాసురమర్దినిగా దుర్గమ్మ


నాయుడుతోటలో చతుర్భుజ దుర్గ


దుర్గమ్మ రూపిణిగా వేపగుంట ముత్యాలమ్మ


ప్రత్యేక అలంకరణలో కళ్యాణ వెంకన్న(ఫైల్)

మద్యం దుకాణాలకు పోటెత్తిన దరఖాస్తులు

... మొదటి పేజీ తరువాయి

ఎంట్రీపాస్‌లను స్కానింగ్ చేసిన తర్వాత దరఖాస్తుదారులను లోపలికి పంపిస్తామన్నారు. అనంతరం ఒక దుకాణం తర్వాత మరో దుకాణానికి దరఖాస్తు చేసుకున్న వారిని చిల్డ్రన్ ఎరీనాలోకి అనుమతిస్తామన్నారు. దరఖాస్తుల సీరియల్ నంబరు ఆధారంగా టోకెన్ నంబర్లు ఇచ్చి, వాటిని దరఖాస్తుదారులే ఒక డబ్బాలో వేయాల్సి ఉంటుందని, వాటిని కలెక్టర్ సమక్షంలో కలిపి ఒక టోకెన్‌ను తీస్తామన్నారు. తర్వాత స్టాండ్‌బైగా మరో ఇద్దరని ఎంపిక చేస్తామన్నారు. లాటరీలో దుకాణం దక్కించుకున్న వ్యక్తి అక్కడే మొదటి విడత లైసెన్స్‌ఫీజు చెల్లించి దుకాణం పేరుతో ఒక బ్యాంకు ఖాతాను తెరవాల్సి ఉంటుందన్నారు. అలా 155 దుకాణాలకు మధ్యాహ్నం ఒంటిగంటలోగా లాటరీ ప్రక్రియ పూర్తిచేయాలని భావిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియను బయట కూర్చున్న వారు ప్రత్యక్షంగా వీక్షించేందుకు వీలుగా స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. దుకాణానికి దరఖాస్తు చేసుకున్నవారికి బదులుగా వేరొకరు లాటరీలో పాల్గొనాలంటే వారి నుంచి ఆథరైజేషన్ లెటర్ తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. లాటరీలో పాల్గొనేందుకు వచ్చేవారంతా తమ వాహనాలను ఏపీఐఐసీ మైదానంలో పార్కింగ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

విపత్తుపై విజయం

... మొదటి పేజీ తరువాయి

కి.మీ. వేగంతో వీచిన పెనుగాలులకు వేల సంఖ్యలో వృక్షాలు నేలకూలాయి. జాతీయ రహదారి మొత్తం కూలిన వృక్షాలతో నిండిపోయింది. రవాణా వ్యవస్థ నిలిచిపోయింది. జనజీవనం స్తంభించిపోయింది. ఒక్క విశాఖ నగరంలోనే 50 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. మూడు రోజులు ఉత్తరాంధ్ర మొత్తం కటిక చీకటిలో కాలం గడిపింది. ఆ చీకటిలోనే వెలుగు రేఖలా రాత్రికి రాత్రి విశాఖపట్నం చేరుకున్నారు నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. వారం, పది రోజులు పాటు ఇక్కడే ఉండి ప్రజలకు అవసరమైనవన్నీ సమకూర్చి, జనజీవనం మళ్లీ సాధారణ స్థాయికి చేరిన తరువాతే విజయవాడ తిరిగివెళ్లారు. విశాఖపట్నం చరిత్రను తిరగ రాయడానికే ఆ తుఫాన్ వచ్చిందా?...అన్నట్టుగా నగరం ఇప్పుడు అభివృద్ధి సాధించింది. స్మార్ట్ సిటీగా జాతీయ స్థాయి గుర్తింపు వచ్చింది. స్థూల ఆదాయం లెక్కల పరంగా చూసుకుంటే దేశంలో ఎనిమిదో స్థానంలో నిలిచింది.

పర్యాటక కేంద్రంగా కైలాసగిరి అభివృద్ధి

హుద్‌హుద్ తుఫాన్ దెబ్బకు కైలాసగిరి తీవ్రంగా దెబ్బతింది. కొండపైన ఘాట్‌రోడ్డు ధ్వంసమైంది. రాకపోకలు నిలిచిపోయాయి. అన్నింటినీ పునరుద్ధరించి అధికారులు అనతికాలంలోనే అందుబాటులోకి తెచ్చారు. కైలాసగిరి పునర్నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయం చేసింది. ఇప్పుడు అదే కొండపై స్కైలైన్ సైక్లింగ్, జిప్ లైనర్‌తో గ్లాస్ బ్రిడ్జి కూడా రూపుదిద్దుకుంటోంది. రివాల్వింగ్ రెస్టారెంట్, రాత్రి బస చేసేందుకు కాటేజీలు ఏర్పాటవుతున్నాయి. విశాఖ వచ్చే పర్యాటకులు కైలాసగిరి చూడకుండా వెళ్లలేని విధంగా తీర్చిదిద్దుతున్నారు.

పెట్టని కోటలా తూర్పు నౌకాదళం

ఆంగ్లేయులు తూర్పు తీరాన విశాఖ కేంద్రంగా ఏర్పాటుచేసిన నౌకాదళం హుద్‌హుద్ తుఫాన్‌కు తీవ్రంగా నష్టపోయింది. ఒక్క నేవల్ డాక్‌యార్డు పరిసరాల్లోనే 50 వేలకు పైగా చెట్లు కూలిపోయాయి. రూ.2 వేల కోట్ల నష్టం వాటిల్లింది. నౌకాదళ సిబ్బంది ఒక వైపు వారి స్థావరాల్లో పునరుద్ధరణ పనులు చేస్తూనే మరో వైపు ఉత్తరాంధ్ర ప్రజలకు సహాయ సహకారాలు అందించారు. విశాఖ వేదికగా నిర్వహించాల్సిన అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్) తుఫాన్ వల్ల రద్దు అవుతుందని భావించినా నౌకాదళం మొక్కవోని దీక్షతో అతి కొద్ది సమయంలోనే అన్నీ సమకూర్చుకొని ప్రపంచ దేశాలకు ఆతిథ్యం ఇచ్చింది. అందరి ప్రశంసలు అందుకొంది.

పెను తుఫాన్ గాలులకు ఉత్తరాంధ్రాలో ఏడు వేలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు, 60 వేల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 361 సబ్‌స్టేషన్లు పనిచేయకుండా పోయాయి. దాదాపు 12 వేల మంది సిబ్బందిని యుద్ధ ప్రాతిపదికన రంగంలో దించి మూడు రోజుల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. అదే సమయంలో విశాఖలో ఎల్ఈడీ విద్యుద్దీపాలకు అంకురార్పణ చేశారు. ఆపరేటర్ల అవసరం లేకుండా సాయంత్రం కాగానే దీపాలు వెలిగేలా చంద్రబాబునాయుడు ఏర్పాటుచేయించారు. విశాఖపట్నం పోర్టుకు భారీ నష్టం వాటిల్లింది. 1.5 లక్షల టన్నుల ఎరువులు కరిగిపోయి నీటి పాలయ్యాయి. క్రూడాయిల్ టెర్మినల్ కుంగిపోయింది. దీనివల్ల రూ.200 కోట్ల నష్టం వాటిల్లింది. ఫిషింగ్ హార్బరులో 13 బోట్లు జెట్టీల్లో మునిగిపోయాయి. అనేక బోట్లు ధ్వంసమయ్యాయి. రక్షణ గోడ పడిపోయింది. విశాఖపట్నం విమానాశ్రయం పైకప్పు పూర్తిగా ధ్వంసమైంది. కొన్నిరోజుల పాటు విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే స్టేషన్ పైకప్పులు ఎగిరిపోయాయి. పదుల సంఖ్యలో రైళ్లు రద్దయ్యాయి. పునరుద్ధరణకు చాలా సమయం పట్టింది. హిందూస్థాన్ షిప్‌యార్డుకు చెందిన ఆస్తులకు భారీ నష్టం వాటిల్లింది. డ్రైడాక్ పూర్తిగా ధ్వంసమైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, గీతం యూనివర్సిటీ, కింగ్ జార్జి ఆస్పత్రులకు నష్టం వాటిల్లింది. టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థ ఛిన్నాభిన్నం అయింది. పోయాయి. ఐటీ ఆర్థిక మండళ్లలో పరిశ్రమలకు, ఆర్టీసీకి కోలుకోలేని నష్టం జరిగింది. పంటల పరిస్థితి చెప్పనక్కర్లేదు. రహదారులె ఎక్కడికక్కడ కోతకు గురయ్యాయి. ప్రభుత్వ అంచనాల ప్రకారం రూ.22 వేల కోట్ల నష్టం జరినట్టు లెక్క తేల్చారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిశ్రమలకు త్వరగా బీమా క్లెయిమ్‌లు వచ్చేలా జాగ్రత్త తీసుకుంది. దాంతో పరిశ్రమలు కోలుకున్నాయి. ఇప్పుడు విశాఖను ఎవరైనా చూస్తే హుద్‌హుద్ వచ్చిన నగరం ఇదే అంటే ఎంత మాత్రం నమ్మరు. అంత అభివృద్ధిని సాధించింది.

'బార్'ల పంట పండింది!

... మొదటి పేజీ తరువాయి

సిబ్బందిని ఆదేశించారు. దీనివల్ల ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఒకటి, రెండు రకాల మద్యం తప్పితే సరకంతా ఖాళీ అయిపోయింది. మద్యం కోసం దుకాణానికి వచ్చే మందుబాబులకు సిబ్బంది సరకులేదని సమాధానం చెబుతుండడంతో వారంతా బార్‌లవైపు పరుగులేస్తున్నారు. బార్‌ల నిర్వాహకులు ఇదే అదనుగా అధిక ధరలకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. బార్‌లలో కౌంటర్‌సేల్ చేయడానికి వీల్లేనప్పటికీ మందుబాబుల తాకిడి ఎక్కువగా ఉంటుండడంతో నిర్వాహకులు భారీ లాభం వస్తుందనే ఆశతో యథేచ్ఛగా కౌంటర్‌సేల్స్ చేస్తున్నారు. అధికారులు కూడా బార్‌ల నిర్వాహకులకు సహకరిస్తుండడంతో అటువైపు కన్నెత్తిచూడడం లేదు. ఉదాహరణకు రూ.130 ఎంఆర్‌పీ ఉన్న చీప్‌లిక్కర్ క్వార్టర్‌ను రూ.200, రూ.220 ఉన్న ఎంసీ విస్కీ క్వార్టర్ రూ.300, రూ.230 ఉన్న 8పీఎం క్వార్టర్‌ను రూ.300కి విక్రయిస్తున్నారు. అదే ఫుల్‌బాటిల్ అయితే రూ.250 వరకూ అధికంగా వసూలు చేస్తున్నారు. బార్‌లలో భారీగా రేట్లు పెంచి విక్రయిస్తున్నప్పటికీ మందుబాబులకు మరో అవకాశం లేకపోవడంతో చెప్పిన ధరకు కొనుక్కొని వెళుతున్నారు. దీనిపై అధికారులను సమాచారం ఉన్నప్పటికీ దరఖాస్తుల స్వీకరణ బిజీలో ఉన్నందున తనిఖీ చేయలేకపోతున్నామని చెప్పేస్తున్నారు. ఈ నేపథ్యంలో 16వ తేదీ వరకు బార్‌లకు పంటపండినట్టేనని మందుబాబులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మాయ 'లేడీ'

... మొదటి పేజీ తరువాయి

అతడిని పెళ్లి చేసుకోవాలని బెదిరించింది. ఆ తరువాత తనను వదిలించుకోవాలంటే డబ్బులు ఇవ్వాలని బెదిరించింది. మోసం చేస్తున్నారని గ్రహించిన ఎన్ఆర్ఐ భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసును విచారిస్తున్నపుడు చాలా విషయాలు బయటకు వచ్చాయి. ఇవన్నీ పోలీస్ కమిషనర్ దృష్టికి వెళ్లడంతో లోతుగా విచారణ చేశారు. మాయలాడి ఇంతకు ముందు ఇలాంటివి చాలా చేసిందని తేలింది. తాజాగా కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో కూడా ఆమెపై కేసు నమోదైంది. ఇంకో వ్యక్తి నేరుగా పోలీస్ కమిషనర్‌కే ఫోన్ చేసి తన పేరు బయటపెట్టనంటే ఆమె చేసిన మోసం చెబుతానన్నారు. ఇలా ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు.

ముఠా అంతా కలిసే...

జమామీ వెనుక ఒక ముఠా ఉన్నట్టు చెబుతున్నారు. ఆమె అందాన్ని ఎర వేసి డబ్బున్న వారిని ఉచ్చులోకి లాగారు. ఆ తరువాత వారికి డ్రగ్స్ ఇస్తున్నారు. వాటిని వాడటం వల్ల కొందరికి శరీరంపై పొక్కులు వచ్చి అనారోగ్యానికి గురైనట్టు సమాచారం. దీనిపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ముఠా మనీ లాండరింగ్ వ్యవహారాలు కూడా నడుపుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జమామీ నుంచి కారు, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. లాప్‌టాప్‌లో ఫోన్ డేటా మొత్తం ఉంది. అందులో వివరాల ద్వారా బాధితులు, ఆమెతో సంబంధం ఉన్నవారి వివరాలపై ఆరా తీస్తున్నారు. అలాగే ఆమె ఫోన్ పే ద్వారా జరిగిన లావాదేవీలను బట్టి ఎక్కడెక్కడి నుంచి డబ్బులు వచ్చాయి?, ఎవరికి వెళ్లాయి? అనేది కూపీ తీస్తున్నారు. ముఠా సభ్యుల వివరాలు కూడా పోలీసుల వద్ద ఉన్నాయి. వారి కోసం వెదుకుతున్నారు. పెళ్లయిన బాధితులు తమ వివరాలు ఎక్కడ బయట పడతాయోనని భయపడుతున్నారు. ఈ కేసులో చాలా విషయాలు బయటకు వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఆమె నేరుగా తన వలలో పడిన వారింటికి రాత్రి పూట వెళ్లి బెదిరించేదని సమాచారం. దీనికి సంబంధించిన ఆధారాలు కూడా పోలీసులకు లభించాయి. ఈ వివరాలపై పోలీసులు ప్రశ్నిస్తే...తన వెనుక పెద్ద పెద్ద అధికారులు ఉన్నారని, మీరే ఇబ్బంది పడతారంటూ తిరిగి భయపెడుతుండడం గమనార్హం. తన కేసు లోతుగా తవ్వితే పెద్దలకే నష్టం అన్నట్టుగా ఆమె వ్యవహరిస్తుండడంతో పోలీసులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. బాధితులు కూడా పేర్లు బయట పెట్టబోమని చెబితేనే ఫిర్యాదు చేసేందుకు ముందుకువస్తామని చెప్పడం గమనార్హం. ఏమి చేసినా బయటకు చెప్పుకోలేని వారినే ఈ ముఠా తెలివిగా టార్గెట్ చేసిందని పోలీసులు భావిస్తున్నారు.

బ్రెయిన్ డెడ్ యువకుడు అవయవ దానం

ఆరిలోవ, అక్టోబరు 11 : బ్రెయిన్ డెడ్ అయిన యువకుడు అవయవ దానం చేసి మరో అయిదుగురికి ప్రాణ దాతగా నిలిచాడు. ఒడిశాలోని పర్లాకిమిడి జిల్లాకు చెందిన నరేశ్ పట్నాయక్ (32) ఈనెల 9న ఇంట్లో స్పృహ తప్పి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా బ్రెయిన్‌లో తీవ్ర రక్తస్రావం జరిగినట్టు చెప్పి,మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కిమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈమేరకు అతను శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యులు మృతుడి భార్య, కుటుంబ సభ్యులతో మాట్లాడి, అవయవ దానంపై అవగాహన కల్పించారు. కుటుంబీకులు అంగీకారం తెలపడంతో జీవన్‌ధాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె. రాంబాబు ఆధ్వర్యంలో వైద్యులు మృతుడి శరీరం నుంచి ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీలు, లివర్ సేకరించారు. వాటిని జీవన్‌ధాన్ ప్రోటోకాల్ ప్రకారం ఐదుగురికి కేటాయించినట్టు డాక్టర్ రాంబాబు తెలిపారు.

వైద్య విద్యార్థిని దుర్మరణం

ఆరిలోవ, అక్టోబరు 11 : ఎండాడ పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థిని దుర్మారణం చెందింది. నగరంలోని అల్లిపురంనకు చెందిన పందిరి కనకేశ్, కాంచన దంపతులకు ఇద్దరు కుమార్తెలు. కాంచన తల్లి ఎండాడలో నివసిస్తోంది. ఆమెకు అనారోగ్యం కావడంతో కాంచన, తన రెండో కుమార్తె నిశ్చిత (20)తో కలిసి స్కూటీపై పరా మర్శకు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా ఎండాడ పెట్రోల్ బంక్ దాటిన తరువాత అదే మార్గంలో వస్తున్న ఆయిల్ ట్యాంకర్‌కు స్కూటీ హ్యాండిల్ తగలడంతో అదుపు తప్పి బోల్తా పడ్డారు. నిశ్చిత అక్కడికక్కడే దుర్మరణం చెందగా, కాంచనకు తీవ్ర గాయాలయ్యాయి



కార్యక్రమంలో పాల్గొన్న రవీంద్ర

సంక్షేమమే ప్రధాని మోదీ లక్ష్యం

గాజువాక, అక్టోబరు 11 : దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలన సాగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అన్నారు. నెలిముక్కులో శుక్రవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందన్నారు.బీజేపీ సభ్యత్వం ప్రారంభమైన 40 రోజుల్లో దేశవ్యాప్తంగా ఎనిమిది కోట్లమంది సభ్యత్వం తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, నాయకులు రోహిణి, దానేశ్, జిలకర్ర రమణ, జగదీశ్, మనోహర్ పాల్గొన్నారు.

శమీ పూజకు పూదోట ముస్తాబు

సింహాచలం,అక్టోబరు 11 : సింహగిరిపై ఈనెల 13న జరిగే శమీ పూజకు కొండదిగువ పూదోట సుందరంగా ముస్తాబవుతోంది. స్వామివారు కొండ దిగువకు వచ్చే మెట్ల మార్గంలోని నాచును తీసి, చెత్త తొలగించి శుభ్రపరిచారు. అలాగే ఉత్సవం జరిగే స్వామివారి పూదోట ప్రధాన ద్వారానికి, గోడలకు అందమైన రంగులు అద్దారు. విద్యుత్ దీపాలతో అలంకరణ చేస్తున్నారు. పూదోట చుట్టూ తుప్పలు తొలగించడంతో పాటు అలంకరణలు చేపడుతున్నారు.

ఘనంగా దసరా నవరాత్రి ఉత్సవాలు



కూర్మన్నపాలెం, అక్టోబరు 11: విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యం లో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన చేపట్టారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, కొల్లి ఈశ్వరరావు, లంక బాపిరాజు, రామప్రసాద్, పరుచూరి ప్రభాకర్, ఐలా మాజీ చైర్మన్‌లు యార్లగడ్డ సాంబశివరావు, ఎన్.శేషగిరిరావు, ఏకే బాలాజీ, చీకటి సత్యనారాయణ, పారిశ్రామికవేత్తలు కొల్లి సత్యనారాయణ, పి.పద్మావతి, అట్లూరి రమేష్, నాగిరెడ్డి, కి షోర్, సర్వశుద్ధి సత్య, రామ భద్రరాజు, నవీన్, శ్రీనివాస్ తది త రులు పాల్గొన్నారు. ఐలా కార్యాలయంలో జరిగిన నవమి వేడుకల్లో ఐలా చైర్మన్ రఘు, వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, సెక్రటరీ చీకటి సత్యనారాయణ, సిబ్బంది అంబిక, నాయుడు, శ్రీను, నాని, మేరీ తదితరులు పాల్గొన్నారు. ఎల్వీ నగర్‌లో దుర్గాదేవిగా అలం కరించి పూజలు చేశారు. డ్రైవర్స్ కాలనీలో కనక దుర్గమ ఆలయంలో సామూహిక కుంకుమ పూ జలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేవీఎస్ శంకరరావు, పీబీఎల్ మూర్తి, శివ పాల్గొన్నారు. 88వ వార్డు ఎస్టీబీఎల్‌లో పోలమాంబ ఆలయంలో అర్చకుడు చంద్రమౌళి శర్మ పర్యవేక్షణలో అమ్మవారిని లడ్డూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. 86వ వా ర్డు మాతృశ్రీనగర్‌లో ఆలయ ధర్మకర్త దా మా సుబ్బారావు, ద మయంతి ఆధ్వర్యంలో కాశీ అన్నపూర్ణా దేవి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కణితిలో శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలో దేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సహస్ర వివిధ ఫలార్చన, సామూహిక కుంకుమార్చన పూజ లు నిర్వహించారు. అర్చకులు ఫణిశర్మ నేతృత్వంలో పూజలు నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ సింటర్‌ప్లాంట్‌లో జరిగిన పూజా కార్యక్రమంలో డీజీ ఎం పి.మోహన్, సీనియర్ మేనేజర్స్ తేజోభాస్కర్, ఆంజనేయ నాయక్, కా ర్మిక నాయకులు నమ్మి సింహాద్రి, సత్యనారాయణ, కె.కృష్ణ, నారాయణ పాల్గొన్నారు.


అగనంపూడి: అగనంపూడి పోస్టాఫీస్ వద్ద గల దుర్గ మాంబ ఆల యంలో అమ్మవారు చండీదేవి దర్శనమిచ్చారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీ వెంకటేశ్వరాలయం ఆవరణలో నిర్వహించిన శర్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు విజయలక్ష్మిగా దర్శనమిచ్చారు.

అక్కిరెడ్డిపాలెం: తుంగ్లాం, నాతయ్యపాలెం కాలనీలలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో బాగంగా శుక్రవారం అమ్మవారిని ప్రత్యేక పూలు , నగలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలలో వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పాల్గొన్నారు. అక్కిరెడ్డిపాలెం రామాలయం వద్ద పూజల్లోకార్పొరేటర్ గుడివాడ అనూష పాల్గొన్నారు.

గుడివాడ గురునాథరావు జయంతి

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 11: ఉత్తరాంధ్ర అభివృద్ధికి శ్రమించిన మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు ఆశయసాధనకు అందరూ కృషిచేయాలని మాజీ రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. మిందిలో శుక్రవారం నిర్వహించిన గురునాథరావు 69వ జయంతిలో ఆయన మాట్లాడారు.



ఎంఎస్ఎంఈ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి

» ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్



శివశంకర్‌ను సత్కరిస్తున్న వాసీవా, ఐలా సభ్యులు

ఆటోనగర్, అక్టోబరు 11: ఎంఎస్ఎంఈ ప్రోత్సాహకాలను పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ తమ్మిరెడ్డి శివ శంకర్ తెలిపారు. విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియసిట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసీవాలో నిర్వహించిన పారిశ్రామిక వేత్తల సదస్సులో ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ అభివృద్ధి సంస్థ ద్వారా చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అందించే ప్రోత్సాహకాలను విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. పరిశ్రమల బలోపేతానికి కృషి చేస్తామని, యువతకు ఉద్యోగ కల్పన పై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పారిశ్రామిక వేత్తలు పలు సమస్యలపై వినతి పత్రాలు అం దజేశారు. ఏపీ ఎంఎస్ ఎంఈ డీసీ చైర్మన్‌గా తొలిసారిగా ఆటోనగర్ వి చ్చేసిన శివ శంకర్‌ను వాసీవా, ఐలా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, రామ ప్రసాద్, పరుచూరి ప్రభాకర్, ఐలా చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు కొల్లి ఈశ్వరరావు,సెక్రటరీ చీకటి సత్యన్నారాయణ, లంక బాపిరాజు, ఐలా మాజీ చైర్మన్లు యార్లగడ్డ సాంబ శివరావు, ఎస్.శేషగిరిరావు, ఏకే బాలాజీ, పారిశ్రామిక వేత్తలు కొల్లి సత్యనారాయణ, పి.పద్మావతి, అట్లూరి రమేష్, నాగిరెడ్డి, కిషోర్, సర్వశుద్ధి సత్య, రామభద్రరాజు, నవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కూటమి'తోనే అభివృద్ధి

అగనంపూడి, అక్టోబరు 11: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే చురుగ్గా అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు 79వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. వా ర్డు పరిధిలోని స్నేహపురి కాలనీ, దేశపాత్రునిపాలెంలో రూ. 40 లక్షల నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆ య న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడారు. శివారు గ్రామా ల్లో పూర్తిస్థాయి మౌలిక వసతి కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు. అనంతరం జాతీయ రహదారి శ్రీరామ్‌నగర్ కాలనీ వద్ద చేపడుతున్న చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దసరా సందడిలేని గాజువాక మార్కెట్

గాజువాక, అక్టోబరు 11: గాజువాక మార్కెట్ దసరా కళ తప్పింది. పండగ వస్తుందంటే మూడు రోజుల ముందునుంచి కిటకిటలాడేది.అలాంటిది శుక్రవారం వెలవెలబోయింది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం మార్కెట్‌పై బాగాచూపింది.



















